epaper.samayamdaily.net
APTEL/2006/18267
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 116 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 22 ఫిబ్రవరి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

## ఎదుగుదలకు తొలిమెట్టు
# డీసీసీ పదవి




### కాంగ్రెస్‌లో 'మెరిట్' ఉన్నవారికే పదవులు

- భిన్నాభిప్రాయాలు కార్యకర్తల స్థైర్యాన్ని దెబ్బతీస్తాయి
- అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- ఏపీలో షర్మిల కృషి ఆదర్శనీయం..
- వికారాబాద్‌లో రెండు రాష్ట్రాల నేతల శిక్షణ తరగతులు
- డీసీసీ అధ్యక్షుల శిక్షణలో సీఎం రేవంత్ రెడ్డి

"కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు ఉంటుందని, పదవుల కేటాయింపులో కేవలం 'మెరిట్ లిస్ట్' మాత్రమే ప్రామాణికమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం వికారాబాద్ జిల్లా అనంతగిరిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన డీసీసీ అధ్యక్షుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. డీసీసీ అధ్యక్ష పదవి నాయకుల రాజకీయ ఎదుగుదలకు తొలిమెట్టు అని, ఈ అవకాశాన్ని దుర్వినియోగం చేయవద్దని సూచించారు."

**వికారాబాద్, ఫిబ్రవరి 21:** భారతదేశ ఆత్మ గ్రామాల్లోనే ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గాంధీ సిద్ధాంతాలను విశ్వసించే పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. రిజర్వేషన్లను రద్దు చేయాలనే కుట్ర జరుగుతోందని విమర్శించారు. రెండు తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమాన్ని రేవంత్‌రెడ్డి శనివారం వికారాబాద్ జిల్లా అనంతగిరిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఈ శిక్షణ డీసీసీ అధ్యక్షులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వారి అవకాశాలను మెరుగు పరుచుకునేందుకు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్టీ విధానాలు, ప్రజల సమస్యలపై చర్చించేందుకు ఈ తరగతులు సహాయ పడతాయన్నారు. గాంధీజీపై లాఠీలు ఎత్తడానికి బ్రిటిషర్లు భయపడ్డారని, దేశభక్తులమని అనుకునే కొందరు తూటాలతో గాంధీని చంపారని విమర్శించారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉంటాయని, గాంధీ ఆలోచనలపై కూడా భిన్నాభిప్రాయాలు చెప్పినవారు ఉన్నారన్నారు. 'భిన్నాభిప్రాయాలు చెప్పిన వారిని తరిమేస్తే మనకే నష్టం.. అందరూ కలిసి పనిచేస్తే అనుకున్నది సాధించవచ్చు' అని రేవంత్ అన్నారు.

మిగతా 2 లో



# పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నాం

- పాతవస్తువులు ఇస్తే నిత్యావసర వస్తువులు ఇస్తున్నాం
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం కూడా బాధ్యతే
- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రతో చెత్త ఏరివేత చేపట్టాం
- వినుకొండ సభలో సీఎం చంద్రబాబు వెల్లడి

వివరాలు 5లో..



## 1100 ఫైల్స్ దగ్ధం

డేటా రికవరీ చేయడం కష్టం
కేసుల దర్యాప్తులో ఎఫ్ఎస్ఎల్ ఎంతో ముఖ్యం
నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్ ఘటనపై ప్రత్యేక బృందం

2



## అమెరికాతో ఒప్పందం

రైతాంగానికి నష్టం
దేశ రైతులతో పాటు తెలంగాణకూ ముప్పే
మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

.. వివరాలు 3లో



# గ్రామీణ ప్రాంతాల్లో 12 ఏళ్లుగా ఇల్లు లేదు

- కనీసం ఈ ఏడాదిలో 3 లక్షల ఇండ్లు మంజూరు చేయండి
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి పొంగులేటి విజ్ఞప్తి

3

# పత్తి రైతులకు ఊరట



- నెలాఖరు వరకు కొనుగోళ్లు పొడిగింపు
- రాష్ట్ర ప్రభుత్వ విన్నపానికి సానుకూల స్పందన..
- సీసీఐ కీలక నిర్ణయం
- కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు మంత్రి తుమ్మల కృతజ్ఞతలు

2



## కామారెడ్డి ఎమ్మెల్యే ఆఫీస్ ముట్టడి

కాంగ్రెస్ కార్యకర్తల దాడితో ఉద్రిక్తత
పరస్పరం బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల దాడి
రంగంలోకి పోలీసులు.. అదుపులో పరిస్థితి

3

# అవినీతి నిరూపిస్తే వెంటనే రాజీనామా

- ప్రజలకు ఎవరేంటో తెలుసు
- తనపై దాడి చేసేందుకు షబ్బీర్ కుట్ర
- ఇక ప్రజల్లో ఉంటే తేల్చుకుంటా
- తనకేదైనా జరిగితే సిఎం రేవంత్‌దే బాధ్యత
- కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హెచ్చరిక

3

కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను అవినీతిలో కింగ్ అన్నారని.. తనపై ఏ ఒక్క అవినీతి బయటపడినా స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు.





## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

మీడియా అకాడమి చైర్మన్ శ్రీనివాసరెడ్డి

.. వివరాలు 3లో

### దేశం నుంచి చొరబాటుదార్లను
# తరిమేస్తాం



- ఓటరు జాబితాతో పాటు, దేశంలోనూ స్థానం లేకుండా చేస్తాం
- కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా హెచ్చరిక

2

# పసి పిల్లలపై లైంగిక దాడులు

- 33 మంది బాలలకు నరకం చూపిన దంపతులు
- మరణశిక్ష విధించిన సీబీఐ కోర్టు





2



బాలురపై లైంగిక దాడులకు పాల్పడి, ఆ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెట్టిన ఓ జంటకు ఉత్తరప్రదేశ్‌లోని బాందాలో ఉన్న ప్రత్యేక కోర్టు మరణ శిక్ష విధించింది. నీటిపారుదల శాఖలో జూనియర్ ఇంజినీరుగా పనిచేసిన రామ్‌భావన్, అతడి భార్య దుర్గావతికి ఈ శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు తీర్పు చెప్పింది. 2010-2020 మధ్య పలు జిల్లాల్లో 33 మంది బాలురపై వీరు అత్యాచారం చేసినట్టు రుజువయింది. బాధితుల్లో మూడేళ్ల బాబు కూడా ఉన్నాడు.

# ఢిల్లీ ఉగ్రకుట్రకు లష్కరే ప్లాన్

- ఆలయాలే లక్ష్యంగా దాడికి స్కెచ్
- నిఘా వర్గాల హెచ్చరికలు జారీ
- ఇతర నగరాల్లోనూ పేలుళ్లకు కుట్ర
- హైదరాబాద్‌లో ముగ్గురు అరెస్ట్

4





# పసి పిల్లలపై లైంగిక దాడులు

## 33 మంది బాలలకు నరకం చూపిన దంపతులు

### మరణశిక్ష విధించిన సీబీఐ కోర్టు

**లక్నో, ఫిబ్రవరి 21:** అభంశుభం తెలియని పసి పిల్లలపై కొందరు మానవ మృగాలు లైంగిక వేధింపులకు పాల్పడ్డ కేసులో దంపతులకుమరణశిక్ష పడింది. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారికి కోర్టులు సైతం కఠిన శిక్షలు విధిస్తున్నాయి. తాజాగా ఇలాంటి ఓ కేసు విషయంలో దంపతులకు మరణశిక్ష పడింది. పదేళ్లలో 33 మంది బాలురపై లైంగిక దాడికి పాల్పడటంతో పాటు, ఆ దృశ్యాలను చిత్రీకరించి విదేశాలకు పంపించిన ఈ నరరూప రాక్షస దంపతులకు సరైన శిక్షపడింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రామ్ భవాన్.. చిత్రకూట్ జిల్లాలో గతంలో నీటిపారుదల శాఖలో జూనియర్ ఇంజినీర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో తన భార్య దుర్గావతితో కలిసి 2010–2020 మధ్య.. బందా, చిత్రకూట్ ప్రాంతాల్లో బాలురపై లైంగిక దాడులకు పాల్పడ్డాడు. వీరి దారుణాలకు బలైన వారిలో మూడేళ్ల వయసు చిన్నారులు కూడా ఉన్నారు. ఆన్‌లైన్ వీడియో గేమ్స్, బహుమతులు, తినుబండారాల పేరుతో పిల్లలను మభ్యపెట్టి ఇంటికి రప్పించి ఈ దారుణాలకు ఒడిగట్టారు. ఈ దంపతుల దారుణాలకు సంబంధించిన 2 లక్షల వీడియోలు, ఫొటోలను ఇంటర్నెట్ ద్వారా 47 దేశాలకు పంపించారు. నిందితులపై సీబీఐ 2020 అక్టోబరులో కేసు నమోదు చేసింది. మైనర్ బాధితుల పట్ల సీబీఐ దర్యాప్తు సున్నితంగానే కొనసాగింది. రామ్ భవాన్, అతడి భార్యపై 2021 ఫిబ్రవరిలో సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఆ దంపతుల నుంచి ప్రాణాలతో బయటపడిన పిల్లల్లో కొందరి ప్రైవేట్ భాగాలపై గాయాలు అయ్యాయని, వారిలో కొందరు ఏళ్ల తరబడి ఆసుపత్రులలో చికిత్స తీసుకోవాల్సి వచ్చిందని సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఐదేళ్ల పాటు యూపీలోని పోక్సో కోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. తాజాగా కోర్టు తుది తీర్పును వెల్లడించింది. దీన్ని అత్యంత అరుదైన కేసుగా పోక్సో కోర్టు అభివర్ణించింది. ఈ కేసులో నిందితులైన మాజీ ఇంజినీరు దంపతులకు మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. అలానే బాధితులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# 1,100 ఫైల్స్ దగ్ధం

## డేటా రికవరీ చేయడం కష్టం.. కేసుల దర్యాప్తులో ఎఫ్ఎస్ఎల్ ముఖ్యం

### నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్ ఘటనపై ప్రత్యేక బృందం

**ములుగు, ఫిబ్రవరి 21:** నాంపల్లి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో ఇటీవల జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఘటనలో మొత్తం 1,100 ఫైల్స్ దగ్ధం అయినట్లు నాగ్‌పూర్ నుంచి వచ్చిన స్పెషల్ టీం గుర్తించింది. ఈ దగ్ధమైన ఫైల్స్‌లోని డేటా రికవరీ కోసం ఆ బృందం ఎంతో తీవ్రంగా ప్రయత్నించింది. తాజాగా ఈ ఫైల్స్‌లోని డేటా రికవరీ చేయడం కష్టమని ప్రత్యేక బృందం తేల్చి చెప్పింది. ఈ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో వివిధ కేసుల దర్యాప్తులో ఎఫ్ఎస్ఎల్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో వెంట్రుకలు, ఎలక్ట్రానిక్ డివైజ్‌ల విశ్లేషణ, రక్తం, వేలిముద్రలు, బుల్లెట్లు, లేదా డీఎన్ఏ నమూనాలు, ఆయుధాలు, డాక్యుమెంట్లు ఫోర్జరీ జరిగాయా లేదా ప్రతీది ఇతర అన్ని ఆధారాలను ల్యాబ్‌లోనే పరిశీలించి నివేదికలు సిద్ధం చేస్తారు. ఈ ఆధారాలు ఎన్నో కోర్టు తీర్పుల్లో కీలకంగా ఉంటాయి. కానీ ఈ ప్రమాద ప్రభావం వల్ల కేసుల దర్యాప్తుపై ఎంత వరకు పడనుందనేది ఆందోళనకరమైన విషయం.

# ఓపెన్ టెన్త్, ఇంటర్ షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్, ఫిబ్రవరి 21 :** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ 2026 సంవత్సరానికిగానూ 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల టైమ్‌టేబుల్‌ను విడుదల చేసింది. పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు ఇప్పుడు పూర్తి షెడ్యూల్‌ను చూసుకోవాలని సూచించింది. షెడ్యూల్‌ను పూర్తిగా తేదీల వారీగా పరిశీలించుకోవాలని పేర్కొన్నది. తాజా టైమ్‌టేబుల్ ప్రకారం.. పదో తరగతి, ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు ఏప్రిల్ 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో జరగనున్నాయి. ఉదయం ఫిఫ్ట్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం షిఫ్ట్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సాగనుంది. ఆ తర్వాత ఏప్రిల్ 28 నుంచి మే 5వ తేదీ వరకు ఇంటర్నల్స్, ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి.

# విద్యార్థులకు పోలీస్ శాఖ ఇంటర్న్‌షిప్

**హైదరాబాద్,ఫిబ్రవరి21:** హైదరాబాద్ సిటీ పోలీసులు వినూత్న నిర్ణయం తీసుకున్నారు. డేటా అనాలసిస్, రీసెర్చ్ ప్రాజెక్టులు, ఆధునిక పోలీసింగ్‌లో విద్యార్థులను భాగస్వాములను చేయాలన్న లక్ష్యంతో.. 25 ఏళ్లలోపు డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నిర్వహించనున్నారు. ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన వారికి అధికారిక ధ్రువపత్రాలు ఇవ్వనున్నారు. ఎస్ఎమ్ఐటీ సెల్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించ బోతున్నట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని సూచించారు.

# విద్యుత్ సంస్థ నియామకాల్లో బీసీ రిజర్వేషన్ల ఉల్లంఘన

## మార్చి 4న నేరుగా పరిశీలించాలని కమిషన్ నిర్ణయం

**హైదరాబాద్,ఫిబ్రవరి21 :** రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యుత్ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎన్‌పీడీసీఎల్ మరియు ఎస్‌పీడీసీఎల్ సంస్థల నియామకాలలో రిజర్వేషన్ల ఉల్లంఘన జరుగుతుందని తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం బిసి కమిషన్ దష్టికి తీసుకువచ్చింది. ఈ అంశంపై కమిషన్ సుదీర్ఘంగా చర్చించింది. ఇందులో భాగంగా మార్చి 4వ వారంలో విద్యుత్ సంస్థల కార్యాలయాలను సందర్శించి ఈ విషయంపై విచారణ నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది. మరోవైపు రాష్ట్రంలోని విద్యార్థుల వివరాల సేకరణ వేగవంతం చేయాలని కమిషన్ అధికారులకు సూచించింది. రాష్ట్ర బీసీ కమిషన్ సమావేశం శనివారం ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ జి. నిరంజన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, కమిషన్ మెంబర్ సెక్రెటరీ బాల మాయ దేవి, పాల్గొన్నారు. ఈ సమావేశంలో అధికారులు డిప్యూటి డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, సెక్షన్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్ హాజరయ్యారు. సమావేశంలో కమిషన్ వివిధ అంశాలపై చర్చించింది.

# ఎదుగుదలకు తొలిమెట్టు డీసీసీ పదవి

మొదటి పేజీ తరువాయి

పార్టీలో ఏ లిస్టులకు చోటు లేదు.. కేవలం మెరిట్ లిస్టు ప్రకారమే అవకాశాలు వస్తాయి. డీసీసీ పదవి ఎంతో విలువైనది.. వచ్చిన అవకాశం దుర్వినియోగం చేసుకోవద్దు. డీసీసీ నుంచి పీసీసీ కావొచ్చు. ఎమ్మెల్యే కావొచ్చు.. ఎంపీ కావొచ్చు.. సీఎం కావొచ్చని రేవంత్ రెడ్డి అన్నారు.రెండున్నర శాతం ఓట్ల నుంచి 40 శాతం వరకు కాంగ్రెస్ పార్టీని తీసుకొచ్చామన్నారు. డిజిటల్ మెంబర్‌షిప్‌పై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కాంగ్రెస్‌లో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి పార్టీలో లేదన్నారు. మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసినవాళ్లమవుతామన్నారు. ఎన్నికలకు సమగ్ర సన్నద్ధత, ప్రజలతో అనుసంధానమే లక్ష్యంగా తెలంగాణ, ఏపీకి చెందిన డీసీసీ అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మోతీలాల్ నెహ్రూ దేశం కోసం రూ.వేల కోట్ల ఆస్తులను త్యాగం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశం కోసం ఎన్నో ఏళ్లు జైలులో ఉన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారు. పార్టీలో అందరి పనితీరు మీద




నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. మెరిట్ ఉన్నవారికి పార్టీలో కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ బాధ్యతలు తీసుకున్న వారిని వెతికి మరీ పదవులు ఇచ్చామని సీఎం చెప్పుకొచ్చారు. నాయకుల ప్రతీ కదలికను గమనిస్తూనే ఉంటామని.. మెరిట్ కోటా తప్ప కాంగ్రెస్‌లో ఏ కోటా లేదని స్పష్టం చేశారు. మెరిట్ కోటాలో పాస్ అయితేనే పదవులు వస్తాయని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి చాలా విలువైనదని.. ఈ పదవిని దుర్వినియోగం చేస్తే దేవుడు కూడా కాపాడలేడన్నారు. 'డీసీసీ అధ్యక్ష పదవి మీ ఉన్నతికి తొలిమెట్టు' అని పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనాయకులను అవమానపరచాలని బీజేపీ కుట్ర చేస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీకి ఉండడానికి సొంత ఇల్లు కూడా లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలపై సీఎం రేవంత్ రెడ్డి పొగడ్తల వర్షం కురిపించారు. రాజకీయ వారసత్వం నుంచి షర్మిల వచ్చినా ఆమె అవకాశాలను తీసుకోలేదన్నారు. ముళ్లబాటలో కూడా ఏపీలో కాంగ్రెస్ కోసం షర్మిల కష్టపడుతున్నారని తెలిపారు. ప్రజల దగ్గరికి వెళ్ళి రాజకీయాల్లో రాణించాలని షర్మిల చేస్తున్న కృషిని ఆదర్శంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కాగా, డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరయ్యారు. అలాగే, రెండు రాష్ట్రాల నుంచి సుమారు 70 మంది డీసీసీ అధ్యక్షులు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు

# పత్తి రైతులకు ఊరట

## నెలాఖరు వరకు కొనుగోళ్లు పొడిగింపు

**హైదరాబాద్,ఫిబ్రవరి 21:** రాష్ట్రంలో ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగనున్న పత్తి కొనుగోళ్లు కొనసాగుతాయని, ఈ అవకాశాన్ని పత్తిరైతులు వినియోగించుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. తమ అభ్యర్థన మేరకు పత్తి కొనుగోళ్లను ఫిబ్రవరి నెలాఖరు వరకు సీసీఐ పొడిగించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల గడువును పొడిగించాలని ఇప్పటికే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లను కోరినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. పొడిగించిన గడువును వినియోగించుకొని పత్తిని అమ్ముకోవాలని పత్తి రైతులను మంత్రి తుమ్మల కోరారు.రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు, రాష్ట్రంలోని పత్తి రైతులకు ఇబ్బంది కలగకుండా, ఫిబ్రవరి నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లను కొనసాగించాలని సీసీఐ అంగీకరించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. రైతుల ప్రయోజనాలను ప్రాధాన్యంగా తీసుకొని కొనుగోళ్ల గడువును పొడిగించాలని కేంద్ర ప్రభుత్వం మరియు సీసీఐ దృష్టికి తీసుకెళ్లగా, వారు సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో పత్తి సాగు ఆలస్యంగా ప్రారంభమవడంతో దిగుబడులు కూడా ఆలస్యంగా మార్కెట్‌కు వస్తున్నాయి. ఈ వాస్తవ పరిస్థితిని కేంద్రానికి వివరిస్తూ కొనుగోళ్ల గడువును పొడిగించాలని మంత్రి గారు కోరారు. అలాగే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తో రాష్ట్ర పరిస్థితిని వివరించి, రైతులకు నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఈ సంవత్సరం 45.32 లక్షల ఎకరాలలో పత్తిని సాగు చేయగా, 28.29 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా వేయడం జరిగింది. ఇప్పటివరకు 8,80,053 మంది రైతుల నుంచి రూ.12,823 కోట్ల విలువైన 16.15 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. అదేవిధంగా ఇప్పటివరకు మార్కెట్ ద్వారా 2.24 లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యత ప్రమాణాలు లేని పత్తిని కోనుగోలు చేయడం జరిగింది. అయినప్పటికీ రాష్ట్రంలో ఇంకా 9.99 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి రైతుల వద్ద ఉందని మార్కెటింగ్ అధికారులు అంచనా వేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం కొత్తగా తీసుకొచ్చిన కపాస్ కిసాన్ పై మొదట రైతులు మరియు జిన్నర్ల నుండి వ్యతిరేకత వచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తూ, రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం తీసుకోచ్చిన యాప్ కి రాష్ట్ర ప్రభుత్వం సపోర్టు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దీంతో ఈ యాప్ ద్వారా రైతులు క్యూలలో నిలబడే అవకాశం లేకుండా, సమయపాలన పాటిస్తూ, రైతులకు దగ్గరలోని పత్తి కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించుకునే అవకాశం కలగడంతో పాటు, పత్తి కొనుగోళ్లను రెగ్యులేట్ చేస్తూ, పారదర్శకంగా కొనుగోళ్లను చేపట్టే వెసులుబాటు కలిగిందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో రైతులకు సమయానికి ఎరువుల పంపిణీకి తమ సర్కారు మొబైల్ యూరియా బుకింగ్ యాప్ ని తీసుకొచ్చిందన్నారు. తద్వారా యూరియా బ్లాక్ మార్కెటింగ్ అరికట్టడంతో పాటు అధిక నిల్వలను నియంత్రిస్తూ పారదర్శక పంపిణీ వ్యవస్థ అమల్లోకి వచ్చిందన్నారు. పంట పూర్తిగా మార్కెట్‌కు రాకముందే సీసీఐ వారు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తారనే సమాచారంతో రైతుల్లో ఆందోళన నెలకొందని, నాణ్యమైన పత్తిని ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందనే భయం రైతుల్లో ఉన్న నేపథ్యంలో, మరో 30 రోజులు కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని మంత్రి తుమ్మల సీసీఐను ప్రత్యేకంగా కోరారు. రాష్ట్రంలోని ప్రతి పత్తి రైతు తన పంటను పూర్తిగా విక్రయించే వరకు కొనుగోలు కేంద్రాలను తెరిచి ఉంచాలని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు సీసీఐ సీఎండీ శ్రీ లలిత్ కుమార్ గుప్తా మరియు కేంద్ర వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్ కుమార్‌లకు మంత్రి ఆదేశాలతో వ్యవసాయశాఖ సెక్రటరీ లేఖ రాశారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనుగోళ్ల గడువు పొడిగించడంతో రైతులకు ఉపశమనం లభించిందని మంత్రి తెలిపారు. పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకొని రైతులు సమీపంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకువచ్చి మద్దతు ధరకు విక్రయించుకోవాలని మంత్రి కోరారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

# గ్రామీణ ప్రాంతాల్లో 12 ఏళ్లుగా ఇల్లు లేదు

- కనీసం ఈ ఏడాదిలో 3 లక్షల ఇండ్లు మంజూరు చేయండి
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి పొంగులేటి విజ్ఞప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** తెలంగాణలో గత 12 ఏళ్లుగా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదల గృహ నిర్మాణం నిలిచిపోయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పెండింగ్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలో 3 లక్షల ఇండ్లు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆయనను మంత్రి పొంగులేటి ప్రత్యేకంగా కలుసుకుని వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో గృహ నిర్మాణానికి సంబంధించిన పరిస్థితులను వివరించారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, 2014ఉ 23 మధ్య కాలంలో గత ప్రభుత్వం గ్రామీణ పేదల



ఇండ్ల నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. పదేళ్లలో కేంద్రం నుంచి ఒక్క ఇల్లు కూడా తీసుకోలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తమ ప్రభుత్వం పేదల గృహ నిర్మాణాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుందని చెప్పారు. రాబోయే మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే ఈ ఏడాది దాదాపు నాలుగు లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కేంద్రం సహకరిస్తే ఈ కార్యక్రమం మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. తెలంగాణ గతంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ) 1.0లో భాగస్వామ్యం కాలేదని, అయితే 2023 తర్వాత 2.0లో అధికారికంగా చేరిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి సర్వేలో 11.57 లక్షల అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఏర్పడిన పెండింగ్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది 3 లక్షలు, వచ్చే ఏడాది మరో 2 లక్షల ఇండ్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని అభ్యర్థించారు. పేద కుటుంబాలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసం కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పమని, పేదల సొంతింటి కలను నెరవేర్చడంలో కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందని మంత్రి పొంగులేటి ఆశాభావం వ్యక్తం చేశారు.

# దేశం నుంచి చొరబాటుదార్లను తరిమేస్తాం

- ఓటరు జాబితాతో పాటు, దేశంలోనూ స్థానం లేకుండా చేస్తాం
- కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా

**గౌహతి, ఫిబ్రవరి 21:** నక్సలిజం నుంచి దేశం విముక్తి పొందుతున్నట్లే.. చొరబాటుదారులను ఏరివేయడం కూడా సాధ్యమేనని కేంద్ర మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. అక్రమ వలసదారులను కేవలం ఓటర్ల జాబితా నుంచే కాకుండా.. దేశం నుంచే తొలగిస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో ఈ పనిని పూర్తి చేస్తామని చెప్పారు. అస్సాంలోని కామ్‌రూప్‌లో పోలీస్ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఓ సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. చొరబాటుదారుల ఆక్రమణల నుంచి విడిపించిన స్థలంలోనే ఈ కొత్త క్యాంపస్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు.చొరబాటుదారులను వారు ఆక్రమించిన స్థలాల నుంచి తరిమికొట్టినంత మాత్రాన సమస్య తీరిపోదు. వారు మరోచోట స్థిరపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారిని మొత్తంగా దేశం నుంచే బయటకు పంపించాలి. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని గతంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. కానీ.. కాంగ్రెస్ ఆ పని చేయబోదు. ఎందుకంటే వారే ఆ పార్టీకి ఓటు బ్యాంకు' అని అమిత్ షా ఆరోపించారు. చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు.. అస్సాంకు ముప్పుగా మారాయని విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటే.. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని సవాల్ విసిరారు.రానున్న ఐదేళ్లలో ఈశాన్య భారతంలో అస్సాం పారిశ్రామిక కేంద్రంగా మారుతుందని అమిత్ షా చెప్పారు. అనంతరం గువాహటిలో నిర్వహించిన సీఆర్పీఎఫ్ డే పరేడ్‌లో పాల్గొన్నారు. శౌర్యపరాక్రమాలు, దేశభక్తిలో



అందరికీ ఆదర్శంగా సీఆర్పీఎఫ్ నిలుస్తోందని పేర్కొన్నారు.

# అవినీతి నిరూపిస్తే వెంటనే రాజీనామా

- ప్రజలకు ఎవరేంటో తెలుసు
- తనపై దాడి చేసేందుకు షబ్బీర్ కుట్ర
- ఇక ప్రజల్లో ఉంటే తేల్చుకుంటా
- తనకేదైనా జరిగితే సిఎందే బాధ్యత
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హెచ్చరిక



**కామారెడ్డి, ఫిబ్రవరి 21:** కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను అవినీతిలో కింగ్ అన్నారని.. తనపై ఏ ఒక్క అవినీతి బయటపడినా స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. కామారెడ్డిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డి ఓడిపోయిన కామారెడ్డిలో షబ్బీర్ అలీ అన్నీ తానే అంటున్నారని చెప్పుకొచ్చారు. తనను కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్, జడ్పీటీసీ చేశామని అన్నారని.. ఆయన కామారెడ్డికి చేసిందేమీ లేదని విమర్శించారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన అవకాశంతో తాను కాంగ్రెస్ నుంచి గతంలో గెలిచానని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి ప్రస్తావించారు. 'వైఎస్ రాజశేఖర్ రెడ్డి నా రాజకీయ గురువు. నువ్వు మా తండ్రి వద్ద చేతులు కట్టుకుని నిలబడ్డావ్. నువ్వు కట్టిన ఐదు అంతస్తుల భవనానికి మున్సిపల్ అనుమతి లేదు. ఈ నియోజకవర్గం నీ సొంతం కాదు. నీవల్లే నేను కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చాను. అసెంబ్లీలో హుందాగా ఉండాలని మాట్లాడిన నన్ను ఇలా చీప్‌గా మాట్లాడేలా చేశారు. నాపై నిందలేస్తే ఎలా ఉంటుందో ఈ రోజు చూశారు. ఇది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది. నాపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎస్పీకి ఫిర్యాదు చేశా. మా వాళ్లు ఎవరూ రావద్దని నేను చెబితే మీరు వేలాదిగా తరలిరావాలని మెసేజ్‌లు పెట్టారు. రేపటి నుంచి గ్రామాలకు వస్తా, ఎవరు అడ్డుకుంటారో చూస్తా. బాన్సువాడలో గొడవ జరిగితే మేం మాట్లాడి సద్దుమణిగేలా చేశాం' అని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి తెలిపారు. 263 ఎకరాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎలాంటి అక్రమాలు లేవు. నేను ఒక్క గజం అమ్మినా నిరూపించాలని వెంకటరమణా రెడ్డి సవాల్ విసిరారు. 'దొంగలెవరో ప్రజలకు తెలుసు. నాకేం జరిగినా సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత. రేపటి నుంచి యుద్ధమే. ఇది సీఎంకు, నాకూ మధ్య యుద్ధం. కలెక్టర్ వద్ద కూర్చుందాం. కాలేజీ కమిటీ పేరిట ఎఫ్‌డీలు ఉన్నాయి. అరోరా ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన అక్రమాలపై పోరాడాం. తెలంగాణ యూనివర్సిటీని కామారెడ్డిలో పెట్టమని కోరాం. అప్పుడు మంత్రిగా ఉన్న షబ్బీర్ అలీ ఏం చేశారు. తప్పుడు మాటలు మాట్లాడితే ఊరుకోం. సోమవారం కలెక్టర్ వద్దకు వెళ్దాం. నాపై ఒక్క తప్పు తేలినా కాళ్లు పట్టుకుంటా, పదవి వదులుకుంటా. రమ్మంటే సీఎంఓకు వస్తా' అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ కాలేజీ భూముల్లో ఒక్క ఇంచు తేడా వచ్చిన రాజీనామా చేస్తానన్నారు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి. దొంగ ఎవరో దొర ఎవరో ప్రజలకు తెలుసన్నారు. ఇన్ని రోజులు ప్రశాంతంగా ఉన్న కామారెడ్డిని రణరంగంగా మార్చారని ఫైర్ అయ్యారు. తనను చంపుతామని బెదిరించారని..ఇవాళ ఆ పనిచేశారని ఆరోపించారు. తాను పిలిస్తే వేలమంది రోడ్లమీదకు వచ్చేవాళ్లు.. అపుడు పరిస్థితి ఎలా ఉండేదని ప్రశ్నించారు వెంకటరమణా రెడ్డి. తాను తప్పు చేసినట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పారు. రేపటి నుంచి గ్రామాల్లో తిరుగుతా. ఇక యుద్ధ వాతారణమేనని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి హెచ్చరించారు. తనపై ఏం జరిగినా ప్రభుత్వానిది, సీఎందే బాధ్యత అనిచెప్పారు. ఇవాళ కారు బోల్తా పడింది రేపు మీ ప్రభుత్వం కూడా బోల్తా పడుతుందన్నారు. తమ కుటుంబంపై వచ్చిన ఆరోపణల విషయంలో తన నిజాయితీ నిరూపించుకునేదాక ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటి వరకు కామారెడ్డిలో ఏది జరిగిన భరించా ఇక నుంచి భరించే ప్రసక్తే లేదన్నారు.

# కామారెడ్డి ఎమ్మెల్యే ఆఫీస్ ముట్టడి


- కాంగ్రెస్ కార్యకర్తల దాడితో ఉద్రిక్తత
- పరస్పరం దాడి చేసుకున్న బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు
- రంగంలోకి పోలీసులు..



**కామారెడ్డి, ఫిబ్రవరి 21:** కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు గీరెడ్డి మహేందర్‌రెడ్డి ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి వచ్చారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మహేందర్‌రెడ్డి కారును భాజపా కార్యకర్తలు ధ్వంసం చేశారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో హైటెన్షన్ నెలకొంది. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మధ్య మాటల యుద్ధం ఉద్రిక్తతలకు దారితీసింది. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ నేత గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ప్రయత్నించడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ప్రభుత్వ, అరోరా కాలేజీ భూములను వెంకట రమణారెడ్డి కబ్జా చేశారని షబ్బీర్ ఇటీవల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన వెంకట రమణారెడ్డి.. ప్రభుత్వ కాలేజీ భూములు, శిశుమందిర్ పాఠశాల, అరోరా కాలేజీ విషయంలో కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలపై తాను చర్చకు సిద్ధమని తెలిపారు. కాంగ్రెస్ ప్రజలకు నిజాలు తెలియాల్సిన అవసరం ఉందని.. సాక్ష్యాధారాలతో చర్చకు రావాలని ఎమ్మెల్యే సవాలు విసిరారు. ఈ నేపథ్యంలో శిశుమందిర్ వేదికపై బహిరంగ చర్చకు రెండు పార్టీలు సిద్ధమయ్యాయి. ఇరు పార్టీల నేతల సవాళ్లతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి క్యాంప్ ఆఫీసు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. క్యాంప్ ఆఫీసు నుంచి బయటకు రాకుండా ఎమ్మెల్యేను హౌస్ అరెస్టు చేశారు. మరోవైపు సవాలును స్వీకరించిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. మాజీ సర్పంచ్ గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి ప్రయత్నించారు. ఈ విషయం తెలిసిన బీజేపీ కార్యకర్తలు అక్కడకు చేరుకుని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ముదరడంతో మహేందర్ రెడ్డి కారుపై బీజేపీ కార్యకర్తలు దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. కారును బోల్తా పడేశారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇరు పార్టీల నేతలను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. పరిస్థితి అదుపు తప్పడంతో కాంగ్రెస్ నేత మహేందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

## మీడియా అకాడమి ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ మీడియా అకాడమి కట్టుబడి ఉందని ఛైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం తెలంగాణ మీడియా అకాడమిలోని కాన్ఫరెన్సు హాలులో 2వ పాలకమండలి సమావేశం ఛైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలోని 8 జిల్లాలకు చెందిన జర్నలిస్టులకు శిక్షణా కార్యక్రమాలు, వివిధ అంశాలపై 7 వర్క్ షాప్ లు, 12 మంది సీనియర్ జర్నలిస్టులు చేసిన సేవలను రాబోయే తరాలకు తెలియపర్చాలనే ఉద్దేశ్యంతో వారి జీవితాలపై మోనోగ్రాఫ్స్ ముద్రించినట్లు ఆయన తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమంలో భాగంగా విడతల వారీగా 120 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయం, 5 సంవత్సరాల కాల పరిమితితో నెలకు 3 వేల రూపాయల పెన్షన్ సదుపాయం కల్పించినట్లు ఆయన వివరించారు. అదే విధంగా అనారోగ్యం, ప్రమాదాలకు గురైన 19 మంది జర్నలిస్టులకు ఆర్థిక సహాయం చేశామన్నారు. అకాడమి భవన నిర్వహణలో భాగంగా 250 మంది సీటింగ్ కెపాసిటీ గల ఆడిటోరియం అ÷-దదెకు ఇవ్వడానికి సమావేశంలో చర్చించగా కమిటీ సభ్యులు తమ ఆమోదం తెలుపడం పట్ల కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వర్కింగ్ కౌన్సిల్ సభ్యులు మీడియా అకాడమి భవన నిర్వహణలో భాగంగా ఆడిటోరియం అద్దెకు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేస్తునే ఈ విధానం పూర్తిగా ఆన్ లైన్ విధానం ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకునే విధంగా మీడియా అకాడమి వెబ్ సైట్లో ఆయా తేదీలు, సమయ పాలనని పొందుపర్చాలని సూచించారు. అప్పుడే పూర్తి పారదర్శకత చేకూరుతుందని వారు వెల్లడించారు. అందుకోసం ప్రభుత్వ ఆధీనంలోని రవీంద్రభారతి, జె.ఎన్.టి.యూ., సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయాకు సంబంధించిన విధి, విధానాలను అధ్యయనం చేసి అ÷-దదెకు సంబంధించిన విధి విధానాలను రూపొందించాలని మీడియా అకాడమి కార్యదర్శికి సూచించారు. ఈ పాలక మండలి సమావేశంలో సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ శ్రీమతి సి.హెచ్. ప్రియాంక, ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ సతీష్ కుమార్ తల్లాడి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ ఇంచార్జి హెడ్ డా. సునిల్ కుమార్ పోతన, దూరదర్శన్ కేంద్ర ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ శ్రీమతి ఎ. చాందిని, ఆల్ ఇండియా రేడియే ప్రోగ్రామ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. రమేష్ సుంకసారి, స్పెషల్ గెస్ట్ వీర నారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం జర్నలిజం డిపార్టుమెంట్ హెడ్ బి.వి. కృష్ణాజీరావు, తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.



# మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హౌస్ అరెస్టు

**మేడ్చల్, ఫిబ్రవరి 21:** మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డితోపాటు పెద్ద ఎత్తున ఈటల నివాసానికి చేరుకున్న పోలీసులు ఆయన్ను ఇంట్లోనే నిర్బంధించారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఇంటిమీద దాడి నేపథ్యంలో ఆయన్ని పరామర్శించేందుకు ఈటల రాజేందర్ కామారెడ్డి బయల్దేరారు. ఈ క్రమంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈటలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ప్రభుత్వ వైఖరిని, పోలీసుల తీరును ఈటల తీవ్రంగా ఖండించారు. గుండాయిజం చేస్తూ ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.



# అమెరికాతో ఒప్పందం రైతాంగానికి నష్టం

## దేశ రైతులతో పాటు తెలంగాణకూ ముప్పే

## మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్,ఫిబ్రవరి21 :** కేంద్ర ప్రభుత్వం అమెరికాతో ఇటీవల చేసుకున్న ఒప్పందాల వల్ల తెలంగాణ రైతులతో పాటూ దేశంలోని రైతులు తీవ్ర నష్టానికి గురయ్యే ప్రమాదం ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అమెరికాలో సాగవుతున్న జొన్న, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి వంటి పంటలను భారతదేశంలోకి ఎలాంటి టాక్స్ లేకుండా అనుమతించడం వల్ల మన దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న రైతులతో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రైతులు ప్రమాదంలో పడతారని తెలిపారు. మన దేశంలో కూడా అన్నదాతలు మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, పత్తి పంటలని ఎక్కువగా పండిస్తూ జీవనం సాగిస్తున్నారని వివరించారు. అమెరికా దేశం నుంచి ఈ పంటలను దిగుమతి చేసుకోవడం వల్ల తెలంగాణలో ఉన్న రైతులంతా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో రైతులకు సంబంధించిన ఓ కార్యక్రమానికి హరీశ్‌రావు ఇవాళ (శనివారం) హాజరయ్యారు. వివిధ స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయం చేస్తే మంచి లాభాలు పొందే అవకాశం ఉందని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న యాంత్రిక పరికరాలను ఉపయోగించుకోవాలని దిశానిర్దేశర చేశారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ సర్కార్ రైతు భరోసా రావడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. కేవలం 12 గంటల పాటే విద్యుత్ సరఫరా ఇస్తున్నారని, ఎరువులు సకాలంలో అందడం లేదని చెప్పుకొచ్చారు. అన్నదాతల సమస్యలను త్వరలో జరిగే రాష్ట్ర బ్జడెట్ సమావేశాల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేసే రైతులకు వ్యవసాయ పనిముట్లు, డ్రోన్లు, ట్రాక్టర్లు సబ్సిడీకి ఇచ్చే విధంగా బ్జడెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి చర్యలు

**నిర్మల్, ఫిబ్రవరి 21 :** గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమానికి చర్యలు తిసుకుంటున్నట్లు ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ బి.ఎం వినోద్ కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ, గల్ఫ్ ఎన్ఆర్ఐ పాలసీ రూపకల్పనకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ వినోద్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రం నుంచి వివిధ గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న కార్మికుల సంక్షేమం కొరకు ప్రభుత్వం సమగ్ర ఎన్ఆర్ఐ పాలసీని రూపొందించేందుకు కృషి చేస్తుందని అన్నారు. ఇందులో భాగంగానే కమిటీ, నిర్మల్ జిల్లాలో పర్యటించిందని తెలిపారు. గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న కార్మికులకు ఏ విధమైన పాలసీలు పాలసీలు రూపొందించాలన్న విషయంపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా తెలుసుకునేందుకు గల్ఫ్ వలస కార్మికులు, వారి కుటుంబాలతో వివరాలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.





# రియల్ ప్రాజెక్టు ప్రకటనల్లో రెరా రిజిస్ట్రేన్ తప్పనిసరి

## నిబంధనలు ఉల్లంఘించిన అమేయ, వర్టెక్స్, గోద్రేజ్ ప్రాజెక్టులు

## ఆయా సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** ఇల్లు/ప్లాట్/యూనిట్ అమ్మకాలపై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ రిజిస్ట్రేషన్ లేకుండా కొనుగోలుదారులను ఆకర్షించేందుకు ముందస్తు ప్రకటనలు ఇచ్చి మోసం చేయద్దని ప్రమోటర్లు/డెవలపర్లు, ఏజెంట్లు మరియు ప్రచార మాధ్యమాలను తెలంగాణ రెరా అథారిటీ గట్టిగా హెచ్చరించింది.రెరా చట్టం ప్రకారం, 500 చదరపు మీటర్లు దాటితే మరియు8 కంటే ఎక్కువ యూనిట్లు కలిగి ఉన్న ప్రతి ప్రాజెక్టును ముందుగా తెలంగాణ రెరాలో రిజిస్టర్ చేయాలని, రెరా అథారిటీ ప్రాజెక్టు వివరాలను పరిశీలించి, రిజిస్ట్రేషన్ నంబరును మంజూరు చేసిన తర్వాతే ఆ నంబరు ద్వారా అమ్మకాలపై ప్రకటనలు చేయాలని మోటర్లు/డెవలపర్లు, ఏజెంట్లు మరియు ప్రచార మాధ్యమాలను సూచించింది. ఇందులో భాగంగా ఇటీవల రిజిస్ట్రేషన్ నంబరు పొందుపరచనిచట్టవిరుద్ధమైన ప్రకటనలు రెరా దృష్టికి రావడంతో ఆయా ప్రాజెక్టు సంస్థలకు రెరా అథారిటీ షోకాజ్ నోటీసులను జారీ చేసింది. గోద్రెజ్ ప్రాపర్టీస్, నవనామి ఎలివేట్ ప్రాజెక్టు, వర్టెక్స్ విరాట్ ప్రాజెక్టు, స్వర్గసీమ అమేయ ప్రాజెక్టు, తిరుమల హిల్స్ మొదలగు రియల్ ఎస్టేట్ కన్ స్ట్రక్షన్ కంపెనీలు ఇందులో ఉన్నాయి. కొన్ని కన్ స్ట్రక్షన్ కంపెనీలు రెరా రిజిస్ట్రేషన్ నంబరును పొందుపరిచినప్పటికీ, ఆ ప్రకటన రెరా నిబంధనల మేరకు లేనట్టు గా అథారిటీ గుర్తించింది. స్వర్గసీమ కన్ స్ట్రక్షన్ వారి అమేయ ప్రాజెక్టు ప్రకటనలో అక్షరాల సైజు, ప్రాజెక్టు పూర్తిపేరు, లేఅవుట్ గా రిజిస్టర్ చేసి, ప్రకటన మాత్రం పూర్తి రెసిడెన్షియల్ ప్రాజెక్టుగా చూపిస్తూ కొనుగోలుదారులను తప్పు దోవ పట్టించడం లాంటి ఉల్లంఘనలను గమనించిన రెరా, ఆ సంస్థకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.



## సంపాదకీయం

# నయా నియంతృత్వంలో డోలాన్డ్ ట్రంప్


**ట్రంప్ కారణంగా ప్రపంచ దేశాలకు పీడతప్పడం లేదు. సుంకాలపై అమెరికా సుప్రంకోర్టు చెంప ఛెళ్లు మనిపించినా తగ్గేది లేదంటున్న ట్రంప్‌తో చిక్కులు, ముప్పు తప్పేలా లేదు. ఎందుకంటే ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని, సుప్రీం తీర్పును అధ్యయనం చేస్తున్నామని ప్రకటించారు. ఇది ఓ రకంగా అమెరికా పౌరులకే కాకుండా, ప్రపంచ పౌరులకు కూడా అశనిపాతం లాంటిది. ఇంకా చెప్పాలంటే ప్రపంచానికి ట్రంప్ ఇప్పడు గుదిబండగా మారారు. ఆయన యుద్ధ పిపాస కూడా ప్రపంచ దేశాలకు శాపంగా మారుతోంది.**

అధికారం లేకున్నా.. అత్యవసర చట్టం కింద అడ్డగోలు సుంకాలు విధిస్తామంటే కుదరదని.. అది రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. సుంకాలు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంది తప్ప.. రాజ్యాంగ నిర్మాతలు ఆ హక్కును కార్యనిర్వాహక శాఖకు అప్పగించలేదని స్పష్టం చేసింది. ట్రంప్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు చెబితే.. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు అమెరికా ప్రయోజనాలకే విరుద్ధంగా ఉందంటూ ట్రంప్ మండిపడ్డారు! విదేశీ శక్తుల ప్రభావానికి లోనయ్యారంటూ జడ్జీలపైనే ఆరోపణలు చేశారు. వారు అమెరికాకే అవమానకరమని దుయ్యబట్టారు. సుంకాలపై తగ్గేదేలేదని..వాటి స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాలను అమలుచేస్తామని తేల్చిచెప్పారు. వేరే చట్టాల కింద..అన్ని దేశాలపైనా 10శాతం ప్రత్యామ్నాయ సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. అంటే కోర్టులన్నా ట్రంప్ లెక్కచేయడం లేదని అర్థం చేసుకోవాలి. ఇది ఓ రకంగా చెప్పాంటే నాజీలను మించిన నియంతృత్వ ధోరణిలో ట్రంప్ ఉన్నారు. నాజీనేత హిట్లర్‌ను మించిన నియంతగా ఇప్పుడు ట్రంప్ అవతరించాడు. ముక్కుపిండి సుంకాలు విధించడం, యుద్ధాలతో బెదరించడం అలావాటు చేసుకున్న ఆధునిక నియంతలా ట్రంప్ మారాడు. ఇది ప్రపంచానికి ఓ హెచ్చరిక కావాలి. 'విమోచన దినం' పేరుతో గత ఏడాది ఏప్రిల్ 2వ తేదీన.. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద పలు దేశాలపై ఆయన విధించిన భారీ టారిఫ్‌లను కొట్టేస్తూ శుక్రవారం తీర్పు నిచ్చింది. ఆ చట్టం కింద ఇతర దేశాలతో వాణిజ్యాన్ని నియంత్రించే హక్కు మాత్రమే ఉంటుంది తప్ప సుంకాలు విధించే హక్కు ఉండదని తేల్చిచెప్పింది. తన అధికార పరిధిపై ట్రంప్ చేసిన అత్యంత వివాదాస్పద వాదనలను తోసిపుచ్చింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం పన్నులు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంటుందని.. టారిఫ్‌లు కూడా పన్నుల్లో భాగమేనని మెజారిటీ జడ్జిలు స్పష్టం చేశారు. అయితనా జడ్జిల తీర్పును తప్పు పట్టారు. ఇది న్యాయవ్యవస్థ ఉనికికి కూడా సవాల్ లాంటిదే. సుప్రీం తీర్పును కూడా సవాల్ చేసే స్థితికి ఇప్పుడు ట్రంప్ ఎదిగారంటే ఏమవుతుందో అన్న భయం అమెరికన్ల లోనే ఎక్కువగా ఉంది. టారిఫ్‌ల రూపంలో తాము కట్టిన సొమ్మును తిరిగి చెల్లించాలంటూ అతి పెద్ద వేర్‌హౌస్ చైన్ కాస్ట్‌కో సహా పలు కంపెనీలు ఇప్పటికే దిగువ కోర్టులకు క్యూ కట్టిన నేపథ్యంలో.. ఆ పక్రియ సంక్లిష్టంగా ఉండొచ్చని న్యాయమూర్తి బ్రెట్ క్యావనో అభిప్రాయపడ్డారు. అంతేకాదు.. ఆయన తన తీర్పులో భారత్‌పై విధించిన 25శాతం అదనపు సుంకాల గురించి కూడా ప్రస్తావించారు. చైనా, యూకే, జపాన్, ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి అధ్యక్షుడు ఈ సుంకాలను ఒక సాధనంగా ఉపయోగించుకున్నారు. రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై అదనంగా 25శాతం సుంకాలను విధించారు. రష్యా చమురు కొనబోమని భారత్ హామీ ఇవ్వడంతో ఆ సుంకాలను తొలగించారని క్యావనో గుర్తుచేశారు. ఇక.. ఈ తీర్పుతో అమెరికా స్టాక్ మార్కెట్ సూచీల్లో పెరుగుదల కనిపించింది. అంటే ఓ రకంగా మార్కెట్లు కూడా సుంకాల బారిన పడి విలవిల్లాడుతున్నాయని గుర్తించాలి. ట్రంప్ విధించిన టారిఫలతో అమెరికా ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు 14 దాకా 3,01,000 మందికిపైగా దిగుమతిదారుల నుంచి 133 బిలియన్ డాలర్లు అంటే రూ.12 లక్షల కోట్లు వసూలు చేసింది. ఆ తర్వాత నుంచి ఇప్పటిదాకా వసూలైన మొత్తం కూడా కలిపితే అది 175 బిలియన్ డాలర్ల రూ.16 లక్షలకోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఇవి ఓ దేశ బడ్జెట్‌కన్నా ఎక్కువే. ట్రంప్ ప్రారంభించిన ఈ వాణిజ్య యుద్ధం.. అమెరికా వాణిజ్య భాగస్వాములతో సంబంధాలను దెబ్బతీయడమే కాక, ఆర్థిక మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తీవ్ర అనిశ్చితికి కారణమైంది. ట్రంప్ టారిఫ్ విధానాలు చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పినట్లైందని కెనడా అభిప్రాయపడింది. తీర్పు ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్నామని యూరోపియన్ యూనియన్ తెలిపింది. పరిస్థితులు ఎలా ఉన్నా అమెరికాతో తమ ప్రత్యేక వ్యాపార, వాణిజ్య సంబంధాలు కొనసాగుతాయని బ్రిటన్ తెలిపింది. అమెరికాతో కలిసి పనిచేస్తామంది. ట్రంప్ టారిఫ్‌ల వల్ల నష్టపోయిన వ్యాపారసంస్థలు, డెమొక్రాట్ల పాలనలో ఉన్న 12 అమెరికా రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. ట్రంప్ తన అధికార పరిధిని మించి ఈ చట్టాన్ని వాడారని, పన్నులు వేసే అధికారం అధ్యక్షుడికి లేదని దిగువ కోర్టు తీర్పు ఇచ్చింది. ట్రంప్ సర్కారు ఆ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. సుప్రీం కూడా ఆ తీర్పును సమర్థించింది. ఈ తీర్పును వెలువరించిన ధర్మాసనంలో.. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు నియమించిన ముగ్గురు కన్జర్వేటివ్ జడ్జీలు ఉన్నారు. దీంతో తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వస్తుందని చాలా మంది భావించారు. ట్రంప్ కూడా.. ఇది అమెరికా చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన కేసుల్లో ఒకటని.. ఒకవేళ తీర్పు వ్యతిరేకంగా వస్తే అది దేశ ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ అవుతుందని హెచ్చరించారు. అయితే ఈ దశలో ట్రంప్ మొండివైఖరి కారణంగా అమెరికా పెత్తనం చెలాయించాలన్న పట్టుదల కనిపిస్తోంది. ప్రపంచ దేశాలు ఏమైనా తనకు అక్కర్లేదన్న ధోరణి కనిపిస్తోంది.

# అన్ని దేశాలపై 10% సుంకాలు

- వెంటనే అమల్లోకి
- సుప్రీం తీర్పు తర్వాత ట్రంప్ ప్రకటన
- వాణిజ్య దిగ్బంధానికి హెచ్చరిక

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** అమెరికా సుప్రీంకోర్టు తన పూర్వ టారిఫ్ నిర్ణయాలను రద్దు చేసిన అనంతరం అధ్యక్షుడు డోలాన్డ్ ట్రంప్‌కొత్త నిర్ణయం ప్రకటించారు. ప్రపంచంలోని అన్ని దేశాలపై 10 శాతం గ్లోబల్ టారిఫ్ విధిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఓవల్ ఆఫీస్‌లో ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేసినట్లు తెలిపారు. వైట్‌హౌస్ ప్రకటన ప్రకారం ఈ సుంకాలు ఫిబ్రవరి 24 నుంచి అమల్లోకి వచ్చి 150 రోజుల పాటు కొనసాగనున్నాయి. సుప్రీంకోర్టు తన అధికారాలను పరిమితం చేస్తూ ఇచ్చిన తీర్పుపై తీవ్ర నిరాశ వ్యక్తం చేసిన ట్రంప్, "అవసరమైతే ప్రత్యామ్నాయ చట్టాల కింద మరింత కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. పాత చట్టం కింద విధించిన టారిఫ్‌లను కోర్టు కొట్టివేస్తే, 'సెక్షన్ 122' కింద 10 శాతం గ్లోబల్ సుంకం అమలు చేస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే ఏ దేశంపైనైనా వాణిజ్య దిగ్బంధం విధించే అధికారం తనకు ఉందని పేర్కొన్నారు.



### ఉ భారత్‌పై వ్యాఖ్యలు

రష్యా నుంచి చమురు దిగుమతుల అంశంపై ఇండియా తన అభ్యర్థన మేరకు గణనీయంగా తగ్గించిందని ట్రంప్ పేర్కొన్నారు. భారత్‌తో అద్భుతమైన సంబంధాలు కొనసాగుతున్నాయని, ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కొనసాగుతాయని తెలిపారు. పరస్పర టారిఫ్‌లను 18 శాతానికి తగ్గించే దిశగా చర్చలు సాగుతున్నాయని సంకేతాలు ఇచ్చారు. అలాగే భారత్‌ఉపాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల సమయంలో తాను టారిఫ్‌ల ద్వారా పరిష్కారం సాధించానని పునరుద్ఘాటించారు. ఇరు దేశాలకు "యుద్ధం చేయాలనుకుంటే చేయండి, కానీ అమెరికాతో వ్యాపారం చేయలేరు" అని చెప్పినట్లు వ్యాఖ్యానించారు. అమెరికా సుప్రీంకోర్టు పన్నులు విధించే అధికారం ప్రధానంగా కాంగ్రెస్‌కే ఉందని స్పష్టం చేయడంతో ట్రంప్ న్యాయవ్యవస్థపై విమర్శలు గుప్పించారు. తీర్పు దేశ ప్రయోజనాలకు విరుద్ధమని, కొందరు న్యాయమూర్తులు సరైన నిర్ణయం తీసుకోలేదని ఆరోపించారు. టారిఫ్‌ల ద్వారా గత ఏడాది నుంచి ఇప్పటివరకు సుమారు 175 బిలియన్ డాలర్లకు పైగా వసూలైనట్లు అంచనా. ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సి ఉంటుందా అన్న ప్రశ్నకు ట్రంప్ స్పష్టత ఇవ్వలేదు. సుంకాల వల్ల అమెరికా పరిశ్రమలు బలపడుతున్నాయని, నిరుద్యోగం తగ్గిందని ఆయన పేర్కొన్నారు. అయితే అంతర్జాతీయంగా ఈ నిర్ణయం వాణిజ్య సంబంధాలపై ప్రభావం చూపే అవకాశముంది. ప్రపంచ మార్కెట్లు, వాణిజ్య భాగస్వామ్య దేశాలు తదుపరి పరిణామాలను గమనిస్తున్నాయి.

# ప్రధాని నివాసం కోసం మురికివాడల ఖాళీ

- ఇప్పటికే నోటీసులు ఇచ్చిన అధికారులు
- దాదాపు 700 కుటుంబాలకు ఈ నోటీసులు జారీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** దేశ రాజధాని న్యూఢిల్లీలో పరధాని నూతన నివాస నిర్మాణం.. దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో మురికి వాడల్లో నివాసముంటున్న కుటుంబాలపై పడింది. అక్కడి నుంచి ఖాళీ చేయాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ వారిని ఆదేశించింది. ఈ మేరకు వారికి నోటీసులు పంపింది. అక్కడి నుంచి ఖాళీ చేయకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. దాదాపు 700 కుటుంబాలకు ఈ నోటీసులు అందాయని తెలుస్తున్నది. అయితే కచ్చితమైన గడువు తేదీని పేర్కొనకపోవడం, పునరావాసంపై ఎలాంటి స్పష్టతా లేకపోవడంతో అక్కడి స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రధాని నూతన నివాసం నిర్మాణం నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా ఈ నోటీసులు వచ్చినట్టు అంతా భావిస్తున్నారు. రేస్‌కోర్స్ రోడ్ వెంట ఉన్న భాయిరామ్ క్యాంప్, మస్జీద్ క్యాంప్, డిఐడి క్యాంప్ నివాసితులకు ఈ నోటీసులు అందినట్టు సమాచారం. నోటీసులో ఆ భూమిని ప్రభుత్వానికి చెందినదనీ, ఇకపై అక్కడ నివసించడం అనధికారికంగా పరిగణిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఆదేశాలను పాటించకపోతే చట్ట ప్రకారం అక్కడి నుంచి తొలగింపు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దీనిపై అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. ఈ నోటీసుతో అక్కడి స్థానికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. చాలా మంది నిరుపేదల అక్కడ నివసిస్తూ సమీప ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్నారు. ఖాళీ చేయాల్సిన గడువు, పునరావాసం, ప్రత్యామ్నాయాలపై ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదని వారు అంటున్నారు. కాగా వారు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులను సంప్రదించి.. పునరావాసంపై స్పష్టత కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా ఈ చర్యలు రాజధాని సెంట్రల్ జోన్ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునే విస్తృత ప్రణాళికలో భాగమని అధికారులు తెలిపారు.



# ఢిల్లీ నుంచి మీరట్‌కు కేవలం 58 నిమిషాల్లోనే

**అందుబాటులోకి ఢిల్లీ-మీరట్ నమో భారత్ కారిడార్**

**కారిడార్‌ను జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్ మధ్య ప్రయాణాన్ని సులభతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం మీరట్‌లో పర్యటించి సుమారు రూ.12,930 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పర్యటనలో భాగంగా 82 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ-ఘజియాబాద్-మీరట్ 'నమో భారత్' రీజనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్కారిడార్‌ను పూర్తిస్థాయిలో జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ 'మీరట్ మెట్రో' సేవలను కూడా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు మెట్రోలో ప్రయాణించారు. తాజా ప్రారంభోత్సవంతో ఢిల్లీలోని సారాయ్ కాలే ఖాన్ నుంచి మీరట్‌లోని మోదీపురం వరకు ప్రయాణ సమయం కేవలం 58 నిమిషాలకు తగ్గనుంది. ఇంతకుముందు ఈ ప్రయాణానికి దాదాపు మూడు గంటల సమయం పట్టేది. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే మీరట్ మెట్రో, దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలవనుంది. మరో విశేషమేమిటంటే, ఒకే రైల్వే ట్రాక్‌పై రీజనల్ రైలు (నమో భారత్), లోకల్ మెట్రో (మీరట్ మెట్రో) నడవడం దేశంలో ఇదే తొలిసారి. ఈ కొత్త విధానం పట్టణ రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రద్దీ తగ్గడంతో పాటు పర్యావరణ హితమైన రవాణాకు మార్గం సుగమం అవుతుందని ప్రభుత్వం తెలిపింది.





# దిల్లీ ఉగ్రకుట్రకు లష్కరే ప్లాన్

**ఆలయాలే లక్ష్యంగా దాడికి స్కెచ్**

**నిఘా వర్గాల హెచ్చరికలు జారీ**

**ఇతర నగరాల్లోనూ పేలుళ్లకు కుట్ర**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** దేశ రాజధాని దిల్లీలో మరోసారి పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ లష్కరే తయిబా(రామ) కుట్ర పన్నింది. ఈ మేరకు నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో దిల్లీ పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. దిల్లీలోని ఎర్రకోట, చాందినీ చౌక్ ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలే లక్ష్యంగా ఎల్‌ఈటీ దాడులకు కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. చాందినీ చౌక్ ప్రాంతంలోని ఒక దేవాలయంపై ఐఈడీతో దాడి చేసేందుకు ఉగ్రవాదులు వ్యూహం పన్నుతున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఫిబ్రవరి 6న పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో జరిగిన పేలుడుకు ప్రతీకారంగా, భారత్‌లోని ప్రముఖ ధార్మిక స్థలాలపై దాడులు చేయాలని లష్కరే ప్లాన్ చేస్తోందని నిఘా వర్గాలు చెబుతున్నాయి. కేవలం దిల్లీలోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలు కూడా ఉగ్రవాదుల హిట్ లిస్టులో ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది నవంబర్ 10న ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడులో 12 మంది మరణించిన సంగతి తెలిసిందే. ఆ ఘటనపై దర్యాప్తు ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో మరోసారి ఎర్రకోట పరిసర ప్రాంతాలపై ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాల నుంచి హెచ్చరికలు రావడం దేశ రాజధానిలో కలకలం రేపుతోంది.

## హైదరాబాద్‌లో ఉగ్రకుట్ర.. ముగ్గురు అరెస్ట్

**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** ఉగ్రవాద దాడులకు కుట్ర చేస్తున్నారన్న ఆరోపణలతో మరోసారి హైదరాబాద్‌లో తీవ్ర కలకలం రేపింది. చంచల్‌గూడ జైలు నుంచే ఈ ఉగ్రకుట్రకు ప్లాన్ చేస్తున్నట్లు అనుమానిస్తున్నారు. జైలు నుంచే ఉగ్ర కుట్రకు ప్రణాళికలు సాగినట్లు అనుమానాలు వస్తున్నాయి. మరోవైపు.. వరుసగా పేలుళ్లు జరిపేందుకు కుట్ర చేస్తారన్న ఆరోపణల కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు. పాకిస్తాన్ అడ్డాగా పనిచేసే లష్కరే తోయిబా అనే ఉగ్రసంస్థకు చెందిన ఉగ్రవాది.. చంచల్‌గూడ జైలు నుంచి ఈ ఉగ్రకుట్ర చేసినట్లు ఆరోపణలు రావడంతో అలర్ట్ అయ్యారు. ఈ ఉగ్రవాదితో ములాఖత్ అయ్యేందుకు వచ్చిన తన భార్యతో ఆ టెర్రరిస్ట్ ఉగ్రదాడుల గురించి సంభాషణలు చేసినట్లు సమాచారం. తన భార్య ద్వారా జైలు నుంచి బయటికి ఉగ్ర సమాచారాన్ని చేరవేసినట్టు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.

# పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నాం

- పాతవస్తువులు ఇస్తే నిత్యావసర వస్తువులు ఇస్తున్నాం
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం కూడా బాధ్యతే
- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రతో చెత్త ఏరివేత చేపట్టాం
- వినుకొండ సభలో సిఎం చంద్రబాబు వెల్లడి



**పల్నాడు,ఫిబ్రవరి 21 :** గ్రామీణ ప్రాంతాల్లో మార్చి 31 నాటికి చెత్త సేకరించే బాధ్యత ప్రభుత్వానిదని సీఎం చంద్రబాబు అన్నారు. మండలానికి ఒక స్వచ్ఛరథం ఏర్పాటు చేస్తున్నామని, వారానికి ఒకసారి గ్రామానికి స్వచ్ఛరథం వస్తుందని చెప్పారు. పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించిన ' స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. స్వచ్ఛరథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలను అందజేశారు. ప్రజావేదిక వద్ద స్టాళ్లను పరిశీలించారు. స్వచ్ఛ రథం వచ్చినప్పుడు పాత వస్తువులు ఇస్తే బదులుగా నిత్యావసరాలు ఇస్తారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు మీకు ఆదాయం వస్తుందని చంద్రబాబు అన్నారు. సరిసరాల పరిశుభ్రతతోనే మన ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. పరిశుభ్రత కోసం మనమంతా కంకణబద్ధులం కావాలన్నారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని 2025 జనవరిలో ప్రారంభించాను. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమాలు సాగుతున్నాయి. పచ్చదనం- పరిశుభ్రత, నీరు-మీరుతో ప్రజల వద్దకు వస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటాం. నేను సీఎంగా వచ్చేనాటికి 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. దానిని క్రమంగా తొలగిస్తున్నాం. వర్షాలు పడినప్పుడు భూగర్భ జలాలు కలుషితమయ్యే పరిస్థితి ఏర్పడింది. కలుషిత నీళ్లు తాగితే డయేరియా వంటి అనేక సమస్యలు వస్తాయి. ప్రజలకు స్వచ్ఛమైన నీరు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టాం అని వివరించారు. ప్రతి నెల మూడో శనివారం ఎక్కడ ఉన్నా కార్యక్రమానికి హాజరవుతున్నా. మున్సిపాలిటీల్లో ఇంటింటికి వెళ్లి చెత్తను వంద శాతం సేకరిస్తున్నారు. మార్చి 31 నాటికి గ్రామీణ ప్రాంతాల్లోనూ చెత్త సేకరించే బాధ్యత ప్రభుత్వానిది. రాబోయే రోజుల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొస్తుంది. ఇప్పటికే 'సూపర్ సిక్స్' హిట్ అయ్యింది. 'పేదల సేవలో' కార్యక్రమం కింద మొదటి తేదీనే ఇంటింటికి వస్తున్నాం. ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం కింద డబ్బులు ఇస్తున్నాం. ప్రతి ఎకరాకు నీళ్లిస్తున్నాం అన్నారు. గిట్టుబాటు వచ్చే పంటలు వేయిస్తున్నాం. రైతులకు టెక్నాలజీ అలవాటు చేస్తున్నాం. అగ్రికల్చర్ నిపుణులను అందుబాటులో ఉంచుతున్నాం. రైతాంగం టెక్నాలజీని అందిపుచ్చుకుంటోంది. మైక్రో ఇరిగేషన్, బిందుసేద్యం తదితర కార్యక్రమాలను నేనే ప్రారంభించానని వివరించారు. వారసత్వంగా వచ్చే పంటలే పండిస్తే ఆదాయం లేకుండా ఇబ్బందులు వస్తున్నాయి. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తున్నాం. ప్రతి ఒక్కరికీ అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో రూ.5కే భోజనం పెడుతున్నాం. మెరుగైన జీవన ప్రమాణాల కోసం పీ4 కార్యక్రమం తీసుకొచ్చాం. ఆదాయం పెంచే మార్గాలను నేర్పించి వారిని ఆదుకుంటున్నాం అని అన్నారు. కొత్త విషయాలు నేర్చుకునేందుకు ముందుంటా. ఆదాయానికి చిరునామాగా మన రాష్ట్రం ఉండాలి. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారనేది ప్రజలు గమనించాలి. దిల్లీలో జరిగిన ఏఐ సమిట్‌కు కాంగ్రెస్ వాళ్లు ఆటంకం కలిగించారు. నిన్న దిల్లీలో కాంగ్రెస్ కార్యకర్తల వైఖరి చూసి చాలా బాధపడ్డా. దేశానికి ఎంతో మేలు చేసే కార్యక్రమాలకు అండగా నిలవాలని చంద్రబాబు అన్నారు.



# తిరుమలలో పోటెత్తిన భక్తులు

## సర్వదర్శనానికి 20 గంటల సమయం

**తిరుమల, ఫిబ్రవరి 21:** తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కొండపై భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో సర్వదర్శనానికి ఏకంగా 18 నుంచి 20 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయి, క్యూలైన్లు బయట శిలాతోరణం వరకు విస్తరించాయి. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శనివారం ఉదయం వెల్లడించిన వివరాల ప్రకారం, శుక్రవారం ఒక్కరోజే 68,156 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 28,295 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.46 కోట్లుగా నమోదైంది. గురువారంతో పోలిస్తే దర్శన సమయం 10-12 గంటల నుంచి ఒక్కసారిగా 20 గంటలకు చేరడం రద్దీ తీవ్రతకు అద్దం పడుతోంది. మరోవైపు, రానున్న వేసవి సెలవుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ అధికారులు ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, దర్శన సమయాన్ని తగ్గించే లక్ష్యంతో టీటీడీ అదనపు ఈవో ఆధ్వర్యంలో నిన్న ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. డేటా ఆధారిత వ్యూహంతో రద్దీని సమర్థవంతంగా నియంత్రించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# ఆయేషా మీరా హత్య కేసు ముగింపు

## విజయవాడ సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు

## అవశేషాలను తల్లిదండ్రులకు అప్పగింత!

## ఫిబ్రవరి 27న తెనాలిలో అంత్యక్రియలు



**అమరావతి, ఫిబ్రవరి 21:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసులో విజయవాడలోని సీబీఐ ప్రత్యేక కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు దర్యాప్తును ముగిస్తున్నట్లు ప్రకటించిన న్యాయస్థానం.. వైద్య బృందం సేకరించిన ఆయేషా భౌతిక అవశేషాలను ఆమె తల్లిదండ్రులకు అప్పగించాలని సీబీఐని ఆదేశించింది. ఫిబ్రవరి 27న తెనాలిలో ప్రభుత్వ భద్రత నడుమ మత సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించాలని స్పష్టం చేసింది. ఆయేషా హత్య కేసులో నిందితులను గుర్తించడానికి తగిన ఆధారాలు లభించలేదని సీబీఐ ఇటీవల కోర్టుకు తుది నివేదిక సమర్పించింది. ఈ నివేదికను తాజాగా న్యాయస్థానం ఆమోదించింది. దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు ఆయేషా మీరా మృతదేహానికి రెండో సారి పోస్టుమార్టం నిర్వహించారు. గాంధీ ఆసుపత్రి వైద్యుల అభిప్రాయం తీసుకున్న అనంతరం అవశేషాలను సీబీఐ కోర్టు ముందుంచారు. ఈ క్రమంలో తమ కుమార్తె అవశేషాలను అంత్యక్రియల నిమిత్తం తమకు అప్పగించాలని కోరుతూ ఆయేషా తల్లిదండ్రులు షంషాద్ బేగం, సయ్యద్ ఇక్బాల్ బాషా పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, ఫిబ్రవరి 27వ తేదీ తెనాలిలో అంత్యక్రియలు జరపాలని ఆదేశించింది. ఈ ప్రక్రియ మొత్తాన్ని సీబీఐ, రెవెన్యూ, పోలీసు అధికారులు, మత పెద్దల సమక్షంలో వీడియో రికార్డింగ్ చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అవశేషాల తరలింపునకు ప్రత్యేక వాహనం, ఎస్కార్ట్, భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2007లో విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంలోని హాస్టల్‌లో ఆయేషా మీరా దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే.



# ప్రతి కుక్కకూ ఓ రోజు వస్తుంది

## ఎన్ని కేసులు పెట్టినా, చావనైనా చస్తాను

## ఎట్టిపరిస్థితుల్లో నేను తగ్గనే తగ్గను

## వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు

**అమరావతి, ఫిబ్రవరి 21:** వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ప్రతి కుక్కకూ ఒక రోజొస్తుంది. ఈ రాంబాబు అనే కుక్కకు కూడా ఓ రోజు వస్తుంది. అప్పుడు తగ్గనే తగ్గను' అని ఆయన ప్రభుత్వాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న ఆయన, బెయిల్‌పై విడుదలైన విషయం తెలిసిందే. అనంతరం నిన్న గుంటూరులోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మీడియా సమావేశానికి ముందు, ఆయన తాడేపల్లిలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిశారు. తనపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, అక్రమ కేసులు బనాయించారని జగన్‌కు వివరించారు. దీనిపై స్పందించిన జగన్, పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, న్యాయపోరాటం చేద్దామని భరోసా ఇచ్చారు. మీడియాతో మాట్లాడుతూ, తాను ఆవేశంలో అన్న మాటలపై రియలైజ్ అయ్యానని తెలిపారు. జైలు జీవితాన్ని ఎంజాయ్ చేశానంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. తన పోరాటం మాత్రం ఆగదని స్పష్టం చేశారు. 'ఎన్ని కేసులు పెట్టుకున్నా తగ్గను. చావనైనా చస్తాను గానీ, తగ్గే ప్రసక్తే లేదు' అని పేర్కొన్నారు.

# మండలిలో ఫోటోలతో శ్రీవారికి అపచారం

## లడ్డూ లో వాడింది నెయ్యే కాదని సిట్ చెప్పింది

## లడ్డూ గురించి మాట్లాడితే హెరిటేజ్‌ను ముందుకు తెచ్చారు

## తప్పు చేసిన ఎవ్వరినీ వదలబోనన్న సిఎం చంద్రబాబు



**పల్నాడు,ఫిబ్రవరి21 :** చెప్పులు వేసుకుని వేంకటేశ్వరస్వామి ఫొటోలను మండలిలో వైకాపా సభ్యులు విసిరేశారని సిఎం చంద్రబాబు మండిపడ్డారు. శ్రీవారి విషయం బయట మాట్లాడకూడదని రెండు రోజులుగా ఆగానన్నారు. వేంకటేశ్వరస్వామి స్వయంగా తనను కాపాడారని.. వేంకటేశ్వరస్వామిని అపవిత్రం చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. ఏపీ శాసనమండలిలో వేంకటేశ్వర స్వామి ఫొటోలతో వైసీపీ సభ్యులు చేసిన నిరసనలపై సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ అంశంపై వినుకొండ సభలో సీఎం మాట్లాడుతూ.. శ్రీవారి లడ్డూను అపవిత్రం చేశారని చెబితే హెరిటేజ్‌ను తెరపైకి తీసుకొచ్చారన్నారు. 'నేను ప్రాణం పోయినా తప్పు చేయను' అని స్పష్టం చేశారు. లడ్డూ ప్రసాదానికి వాడింది నెయ్యే కాదని సిట్ చెప్పిందన్నారు. తప్పు చేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్ని ÷ర్ అయ్యారు. తప్పును పక్క వాళ్లపై నెట్టే నీచులు కూడా ఉన్నారన్నారు. అలాంటి కరుడుగట్టిన నేరస్థుడితో రాజకీయం చేయాలా అని విమర్శించారు. తాను కూడా జైలుకు వెళ్తానని ఊహించలేదని.. నోటీసు ఇస్తే సమాధానం చెప్పేవాడినని సీఎం చంద్రబాబు అన్నారు. 'నా ప్రాణం పోయినా పరవాలేదు... రాష్ట్రం కోసం పోరాడతాను' అని చెప్పుకొచ్చారు. చాలా మంది తాను జైల్లో నుంచి ప్రాణాలతో బయటకురారని అనుకున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కొందరు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బూతులు మట్లాడుతున్నారని.. రెచ్చగొట్టే పనులు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. డ్రగ్స్ మత్తులో ఆడబిడ్డల జోలికొస్తే వారికదే చివరిరోజు అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. వివేకా హత్యను గుండె పోటు అని నమ్మించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. నారాసుర రక్త చరిత్ర అంటూ తనపై నెపం నెట్టారని.. వివేకా హత్య చుట్టూ నాటకాల రాయుడు నాటకాలు ఆడారంటూ ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సదస్సులో కాంగ్రెస్ తీరు ఆవేదన కలిగించిందన్నారు. కాంగ్రెస్ తీరు దేశానికి మంచిది కాదన్నారు. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారో ప్రజలు గమనించాలని తెలిపారు. దేశానికి మేలు చేసే కార్యక్రమాలకు అండగా నిలవాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు

# మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం

## వాసుదేవరెడ్డిని అదుపులోకి తీసుకున్న సిట్

**అమరావతి,ఫిబ్రవరి21:** మద్యం కుంభకోణం కేసులో.. విచారణను సిట్ వేగవంతం చేసింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారుల్లో ఒకరైన వాసుదేవరెడ్డిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. దాదాపు రూ. 3,500 కోట్ల మేర అవినీతి జరిగినట్లు ఆరోపణలు వస్తున్న ఈ కేసులో వాసుదేవరెడ్డి అరెస్ట్ అత్యంత కీలకంగా మారింది.వాసుదేవరెడ్డి వైసీపీ హయాంలో బెవరేజెస్ కార్పొరేషన్‌లో కీలక బాధ్యతల్లో ఉండి, మద్యం పాలసీ రూపకల్పన, కంపెనీల ఎంపికలో కీలక పాత్ర పోషించినట్లు సిట్ అధికారులు నిర్ధారించారు. మద్యం కుంభకోణంలో వాసుదేవరెడ్డిని రెండో నిందితుడిగా (ఎ2) సిట్ అధికారులు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆయన కొన్ని మద్యం కంపెనీలకు లబ్ధి చేకూర్చారని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ.. సిండికేట్లకు మేలు చేస్తూ వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడినట్లు సిట్ అధికారుల దర్యాప్తులో తేలింది. ఈ కేసులో అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి వాసుదేవరెడ్డి ఇప్పటికే కింది కోర్టులో ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే కోర్టు బెయిల్ నిరాకరించడంతో ఆయన ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో విచారణ జరుగుతుండగానే పోలీసులు ఆయన్ని అదుపులోకి తీసుకోవడం గమనార్హం. ఈ కేసులో కీలక వ్యక్తుల పేర్లు బయట పెట్టేందుకు వాసుదేవరెడ్డి 'అప్రూవర్' గా మారే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఆయన అప్రూవర్‌గా మారితే.. ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరనేది బయటకు వచ్చే అవకాశం ఉంది. వాసుదేవరెడ్డి అరెస్ట్‌తో ఏపీ రాజకీయాల్లో వేడి రాజుకుంది. మద్యం సరఫరాలో జరిగిన అవకతవకలు, డిజిటల్ పేమెంట్లకు అవకాశం ఇవ్వకుండా నగదు రూపంలో జరిగిన లావాదేవీలపై సిట్ అధికారులు దృష్టి సారించారు. ఆయన అరెస్ట్ తర్వాత మరికొంత మంది అధికారులు, రాజకీయ నేతలకు నోటీసులు అందే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

# రాయలసీమకు చంద్రబాబు తీరని ద్రోహం

## గడికోట శ్రీకాంత్‌రెడ్డి విమర్శలు

**అన్నమయ్య ,ఫిబ్రవరి21(ఆర్ఎన్ఎ):** రాయలసీమకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీరని ద్రోహం చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాయలసీమ ప్రాజెక్టుల విషయంలో కూటమి ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. ' బడ్జెట్ కేటాయింపుల్లో మహిళలకు, నిరుద్యోగులకు కేటాయింపులు లేవు. 50 ఏళ్లు దాటిన వారికి ఒక్కరికీ పింఛన్ ఇవ్వడం లేదు. ప్రతి మంగళవారం క్రమం తప్పకుండా అప్పులు మాత్రం చేస్తూ పోతున్నాడు. ప్రశ్నించేవారిపై దౌర్జన్యాలు చేస్తూ అరాచకపు పరిపాలన చేస్తున్నారు. దేవుడిపై కూడా రాజకీయాలు చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తున్నారు. ఏడు కొండలు, లడ్డూ వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాల్సిన ముఖ్యమంత్రి దిగజారిపోయి పక్క రాష్ట్ర ముఖ్యమంత్రితో ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఓటుకు నోటు కేసులో గురు శిష్యులిద్దరూ దొరికారు. శిష్యుడికి తెలంగాణలో మేలుచేయడం కోసం చంద్రబాబు రాయలసీమను తాకట్టుపెట్టారు. మార్చి 1 వ తేదీన రాయలసీమ సన్నాహక సమావేశం ఉంటుంది. చంద్రబాబు అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం' అని స్పష్టం చేశారు.



## ఫిబ్రవరి నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లు కొనసాగింపు

**హైదరాబాద్ ఫిబ్రవరి21( సమయం న్యూస్).:** రాష్ట్రంలోని పత్తి రైతులకు అనుకూలంగా పత్తి కొనుగోళ్ల గడువును ఫిబ్రవరి నెలాఖరు వరకు పొడిగించినట్లు వెల్లడించారు. వ్యవసాయశాఖ మంత్రి గారి అభ్యర్థన మేరకు Cotton Corporation of India (సీసీఐ) ఈ నిర్ణయం తీసుకుంది.మంత్రి గారి ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ సెక్రటరీ నిన్న కేంద్ర జౌళి శాఖ జాయింట్ సెక్రటరీకి లేఖ రాసి కొనుగోళ్ల గడువును పొడిగించాలని కోరారు. అలాగే ఈ అంశంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గారిని కూడా మంత్రి తుమ్మల ఇప్పటికే సంప్రదించారు.కేంద్ర ప్రభుత్వం మరియు సీసీఐ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల మంత్రి తుమ్మల సంతోషం వ్యక్తం చేశారు. పొడిగించిన గడువును వినియోగించుకొని రాష్ట్రంలోని పత్తి రైతులు తమ పత్తిని అమ్ముకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## ఫింగర్ ప్రింట్ డివైస్ తో తనిఖీలు

- ఎస్సై వెంకటేశ్వర్లు.
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు





**నారాయణపేట,ఫిబ్రవరి,21(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా దొంగతనాల నివారణనే లక్ష్యంగా, అనుమానిత వ్యక్తులను మరియు పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోర్ట్స్ పోలీసులు హనుమంత్, అశోక్ లు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.నారాయణపేట బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలలో, బ్యాంకు ల వద్ద నారాయణపేట పోలీసులు శనివారం అకస్మికంగా ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు నిర్వహించడం జరిగింది.అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తగిన రీతిలో పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్ తో వ్యక్తుల వేలిముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరి పోల్చారు.పౌరులు ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే లోకల్ పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని ఎస్సై ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## మార్చి 25 లోగా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఎంపికకు దరఖాస్తు చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం, ఫిబ్రవరి 21 : ( సమయం న్యూస్ ) :** మార్చి 25 లోగా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఎంపిక కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ నిర్వహించే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ క్రింద పాఠశాలల ఎంపిక కోసం 2026-27 విద్యా సంవత్సరానికి ప్రసిద్ధ, గుర్తింపు పొందినప్రైవేట్ పాఠశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. దరఖాస్తు చేసుకునే పాఠశాలలు స్టేట్ లేదా సెంట్రల్ బోర్డు ద్వారా గుర్తింపు పొంది ఉండాలని, గత 5 సంవత్సరాల్లో 7వ, 10వ తరగతిలో 90 శాతం కంటే ఎక్కువ ఉత్తీర్ణత, 50 శాతం కంటే అధిక విద్యార్థులకు ఫస్ట్ క్లాస్ ఉత్తీర్ణత సాధించి ఉండాలని అన్నారు. పాఠశాలలకు విశాలమైన గదులు, క్రీడా ప్రాంగణం, విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, అనుభవజ్ఞులైన అర్హత కలిగిన బోధనా సిబ్బంది, 50 శాతం కంటే ఎక్కువ సాధారణ సిబ్బంది ఉండాలని అన్నారు.ఆసక్తి, అర్హత కల్గిన ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు తమ సర్టిఫికెట్లతో డిప్యూటీ డైరెక్టర్, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ, ఎస్ -34 , కలెక్టరేట్ సముదాయం, వి. వెంకటాయపాలెం, ఖమ్మం కార్యాలయంలో మార్చి 25 లోగా సమర్పించాలని అన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఎంపిక కలెక్టర్/చైర్మన్ అధ్యక్షతన జిల్లా ఎంపిక కమిటీ ద్వారా జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## టేకుల గడ్డ తండాలో ముమ్మరంగా అభివృద్ధి పనులు





**బొంరస్ పేట మండలం, ఫిబ్రవరి,21(సమయం న్యూస్) :** కొడంగల్ డెవలప్మెంట్ అథారిటీ (కాడ) ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల కల్పనలో భాగంగా బొంరస్ పేట మండల పరిధిలోని టేకులగడ్డ తాండ గ్రామ పంచాయతీ పాఠశాల కాంపౌండ్ వాళ్ళు నిర్మాణ పనులను మండల ఏఈ గ్రామ సర్పంచ్ పాలనధికారి ప్రధానోపాధ్యాయుల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఈ సర్పంచ్ మాట్లాడుతూ కాంపౌండ్ వాల్ నిర్మాణం కొరకు పది లక్షల రూపాయల నిధులు మంజూరయాన్ని తెలియజేస్తూ (115 మీటర్ల) కాంపౌండ్ నిర్మాణ పనులు పేపడతామని తెలియజేశారు.అదేవిధంగా మరికొద్ది రోజులలోనే ఎనిమిది లక్షల నిధుల మంజూరుతో నూతన అంగన్వాడి భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలియజేశారు. కాడ అభివృద్ధి నిధులతో తొందర్లోనే పాఠశాల ఆవరణలో వంటగది నిర్మాణానికి ఏర్పాట్లు ప్రారంభిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తాండవాసులు పెద్దలు పాల్గొన్నారు.

## మెగా ఇంపాక్ట్ వర్క్‌షాప్ & జాబ్ మేళా తొలి రోజు ఘన విజయం



**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** నగరంలోని హరిహర కళాభవన్లో శుక్రవారం ప్రారంభమైన మెగా ఇంపాక్ట్ మోటివేషనల్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్ & జాబ్ మేళా కార్యక్రమం తొలి రోజే విశేష స్పందనను అందుకుంది. లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ చేంజ్ మేకర్ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ జిల్లా 320H పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉదయం 9.30 గంటలకు హాలో టైమ్‌తో ప్రారంభమైన కార్యక్రమం, 10 గంటలకు ప్రముఖ అతిథుల ఆహ్వానంతో ఘనంగా కొనసాగింది. క్లబ్ అధ్యక్షుడు డా. వడ్లాల ప్రభాకర్ అధ్యక్షత వహించి సమావేశాన్ని ప్రారంభించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గవర్నర్ లయన్ గంపా నాగేశ్వరరావు, మల్టిపుల్ కౌన్సిల్ వైస్ చైర్పర్సన్ లయన్ ఎన్. మనోహర్ రెడ్డి, రెండో వైస్ జిల్లా గవర్నర్ లయన్ డి. లింగా రెడ్డి, డిస్ట్రిక్ట్ చీఫ్ అడ్వైజర్ పీఎంసీసీ లయన్ జె. జగన్ మోహన్ రెడ్డి, డీసీఎస్ లయన్ కమలాకర్ ముస్త్యాల, డీసీటీ లయన్ ఎస్. పి. యాదగిరి రెడ్డి పాల్గొన్నారు. ఈరోజు చీఫ్ గెస్ట్‌గా ఎమ్‌డీ జీఎల్టీ కోఆర్డినేటర్ లయన్ డా. చిట్టి ప్రకాష్ రావు హాజరై సందేశం అందించారు. కార్యక్రమంలో జాతీయ పతాక వందనం, స్వాగత ప్రసంగం, వివిధ అతిథుల ప్రసంగాలు మరియు చీఫ్ గెస్ట్ సన్మానం నిర్వహించారు.సభలో మాట్లాడిన నేతలు యువతలో ఆత్మవిశ్వాసం, నైపుణ్యాభివృద్ధి, సమగ్ర వ్యక్తిత్వ వికాసం అత్యవసరమని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.జాబ్ మేళాకు 50కు పైగా సంస్థలు హాజరై వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలను అందించాయి. ఉద్యోగార్థులు ప్రత్యక్ష ఇంటర్వ్యూల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పలువురు అభ్యర్థులు ప్రాథమిక ఎంపికకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో క్లబ్ అధ్యక్షుడు డా. వడ్లాల ప్రభాకర్, కార్యదర్శి రవి ముప్పిడి, ఖజాంచి పి. శ్రావణ్ కుమార్ మరియు సభ్యులు విశేష కృషి చేశారు.మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ కార్యక్రమం ఫిబ్రవరి 22 వరకు కొనసాగనుంది. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

## గ్రామీణ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం ఒక వరం

- బిజ్వార్ జెడ్పీ పాఠశాలలో ఉచిత పాఠశాల బస్సును ప్రారంభించిన కలెక్టర్.





**ఉట్కూరు మండలం, ఫిబ్రవరి,21(సమయం న్యూస్) :** గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పాఠశాలకు సురక్షితంగా సకాలంలో చేరుకునే రవాణా సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఉచిత పాఠశాల బస్సు ఒక వరం అని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పేర్కొన్నారు. నారాయణ పేట జిల్లా ఉట్కూరు మండలం బిజ్వార్ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన అంబాత్రయ క్షేత్రం వ్యవస్థాపకులు శ్రీ శ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామీజీ రూ.40 లక్షల వ్యయం గల పాఠశాల బస్సును ఉచితంగా అందజేశారు. శనివారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదిత్య పరాశ్రీ స్వామీజీ తో కలిసి ఉచిత పాఠశాల బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..దూర ప్రాంత గ్రామాల నుంచి పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందన్నారు.ఈ సేవను బిజ్వార్‌కు చెందిన శ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామీజీ దాతృత్వంతో ఏర్పాటు చేశారని, ఆయన ఏర్పాటు చేసిన ఈ రవాణా సౌకర్యం ద్వారా మండలంలోని కొత్తపల్లి, పాతపల్లి, మొగ్దుంపూర్ గ్రామాలకు చెందిన మొత్తం 63 మంది విద్యార్థులు ప్రత్యక్ష లబ్ధి పొందనున్నట్లు ఆమె తెలిపారు. ఈ బస్సు సేవ వల్ల విద్యార్థులు సురక్షితంగా, సమయానికి పాఠశాలకు చేరుకొని నిరంతర విద్యాభ్యాసం కొనసాగించేందుకు అవకాశం ఉందని చెప్పారు.గ్రామీణ వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు విద్య అందుబాటులో ఉండేందుకు రవాణా సౌకర్యం కీలకమని తెలిపారు. స్థానిక పండుగలు వేడుకల కారణంగా తరచుగా విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరు కావడం వారి అభ్యాసానికి అంతరాయం కలిగిస్తుందని పేర్కొంటూ, విద్యకు ఎల్లప్పుడూ ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని తల్లిదండ్రులు గ్రామ ప్రజలను కలెక్టర్ కోరారు. తరచూ గైర్హాజరు వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని క్రమబద్ధమైన హాజరుకు కుటుంబాలు సమాజం కలిసికట్టుగా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీ శ్రీఆదిత్య పరాశ్రీ స్వామీజీ మాట్లాడుతూ..తాను చిన్నప్పుడు ఇదే పాఠశాలలో చదువుకున్నానని తెలిపారు. ఆ పాఠశాల పట్ల ఉన్న కృతజ్ఞతాభావంతోనే ఈ రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేశానన్నారు. తాను చేసింది సేవ కాదని,బాధ్యత కర్తవ్యం అని అన్నారు. తాను చదువుకునే రోజుల్లో ఇంట్లి అన్ని పనులు చేసి పాఠశాలకు ఆలస్యంగా వచ్చేవాడిని, అలాంటిది పక్క ఊర్ల నుంచి విద్యార్థులు నడుచుకుంటూ రావడం సాహసమే అన్నారు. పుట్టిన ఊరికి, చదువుకున్న పాఠశాలకు ఏదో ఒకటి చేయడం ధర్మం అని తెలిపారు. ప్రతిరోజూ విద్యార్థులు నడుచుకుంటూ ఆశ్రమం ముందు నుంచి పాఠశాలకు వెళ్తుండటం చూసి తనకు ఎంతో బాధ కలిగిందని, ఆ కష్టాన్ని తొలగించాలనే సంకల్పంతో ఈ ఉచిత బస్సు సేవను ప్రారంభించానని తెలిపారు. 2024 లో పాఠశాలకు బస్సు ఇవ్వాలని నిర్ణయిం చుకుంటే అన్ని నియమ నిబంధనల ప్రకారం ప్రక్రియ పూర్తి చేయడానికి 2026 జనవరి అయిందన్నారు. బస్సు విషయంలో ఆర్టీవో ఎంతో సహకరించింది అని చెప్పారు. సేవా కార్యక్రమాలు స్వచ్ఛందంగా చేయడం ఎంత ముఖ్యమో, అవి చట్టపరమైన పరిమితులలోనే లోబడి ఉండటం మరింత ముఖ్యమని స్వామీజీ పేర్కొన్నారు. సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశం ఉన్నప్పటికీ ప్రతి కార్యక్రమం చట్టాన్ని గౌరవిస్తూ నిర్వహించాల్సిన బాధ్యత మనందరిదని తెలిపారు. దేశంలో ఉన్న స్వామీజీలు దేశానికి ధర్మానికి కట్టుబడి ఉంటారని ఆయన తెలిపారు. బిజ్వార్ జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ ఉచిత బస్సు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతూ తమ లక్ష్యాలను సాధించాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు.కార్యక్రమంలో తన చిన్ననాటి ఉపాధ్యాయురాలు సంజన ని దర్శించగానే స్వామీజీ భావోద్వేగానికి లోనయ్యారు. గురువుల పట్ల తనకు ఉన్న గౌరవాన్ని వ్యక్తం చేస్తూ, జీవితంలో ఎదుగుదలకు గురువుల మార్గదర్శకత్వమే అసలు పునాది అని పేర్కొన్నారు. తనకు పాఠశాలలో రెండుసార్లు 50, 50 రూపాయల పరీక్ష ఫీజు చెల్లించిన హిందీ టీచర్ సంజనకు తాను 100 రూపాయలు బాకీ ఉన్నానని, వాళ్ళ ఇంటికి వెళ్ళి 100 రూపాయలు ఇస్తానని నవ్వుతూ చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యాశాఖ అధికారి గోవిందరాజులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసిన జిల్లాల పరంగా రాష్ట్రంలో మన జిల్లా రెండవ జిల్లాగా నిలవడం గర్వకారణమని తెలిపారు. ముఖ్యంగా ఆధ్యాత్మిక రంగంలో ఉన్న వ్యక్తి స్వచ్ఛందంగా ముందుకొచ్చి విద్యార్థుల కోసం ఇలాంటి సేవా కార్యక్రమాన్ని చేపట్టడం అత్యంత ఆదర్శప్రాయమని అభినందించారు. సమాజం లోని అన్ని వర్గాలు విద్యాభివృద్ధికి తోడ్పడితే ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు.ఉపాధ్యాయుల, తల్లిదండ్రులు గ్రామ ప్రజలు ఈ సేవను అభినందిస్తూ, ఇది విద్యార్థుల ప్రయాణ కష్టాలను తగ్గించి పాఠశాల హాజరును మెరుగుపరుస్తుందని తెలిపారు.అంతకు ముందు జిల్లా పరిపాలన తరఫున కలెక్టర్ స్వామీజీ దాతృత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత మందిని విద్యాభివృద్ధి దిశగా ప్రేరేపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో మేఘా గాంధీ, తహసిల్దార్ చింత రవి, ఎంపీడీవో కిషోర్ కుమార్, బిజ్వర్ గ్రామ సర్పంచ్ అంజయ్య, కొత్తపల్లి సర్పంచ్ నర్సిములు,పాతపల్లి సర్పంచ్ తెరప్ప, మొగ్దుంపూర్ సర్పంచ్ తిరుమలేష్, పాఠశాల హెచ్ఎం కిషోర్ కుమార్, విద్యాశాఖ అధికారులు రాజేంద్ర కుమార్,విద్యాసాగర్, నాగార్జున రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహ, నాయకులు శేర్ కృష్ణ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పద్మమ్మ, గ్రామానికి చెందిన వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## గంగారంలో కోడిపందాల స్థావరంపై దాడి



**ఖమ్మం , ఫిబ్రవరి 21 : ( సమయం న్యూస్ ) :** జిల్లాలోని సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని గంగారం గ్రామ శివారు ప్రాంతం ప్రకాష్ నగర్ కాలనీలో కోడి పందాలు నిర్వహిస్తున్న శిబిరంపై సత్తుపల్లి పోలీసులు దాడి నిర్వహించారు . విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం తెల్లవారు జామున ఇన్స్పెక్టర్ శ్రీహరి, ఎస్సై అశోక్ కుమార్ లు తమ సిబ్బందితో సత్తుపల్లి మండలం, గంగారం గ్రామం ప్రకాష్ నగర్ కాలనీ శివారులో గల దూదిగం కొటేశ్ కి చెందిన పామాయిల్ తోటలో కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై దాడిచేసి 14 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 165,000 ల నగదు , 2 కోడి పుంజులు , 2కత్తులు, 6 మోటార్ సైకిళ్ళు, 11 కార్లు స్వాధీన పరచుకొని వారిని పోలీసు స్టేషన్ కు తరలించారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చెస్తునట్లు కల్లూరు ఏసీపీ వసుందర యాదవ్ తెలిపారు.పట్టుబడిన వారిని కోడిపందేలు నిర్వహిస్తే వచ్చే ఆర్థిక ఇబ్బందుల గురించి,కేసుల వలన జరిగే నష్టాల గురించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా నిందితులను బైండవర్ నిమిత్తం సత్తుపల్లి తహసీల్దారు ముందు హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. కల్లూరు సబ్ డివిజన్ పరిదిలో గల పోలీసు స్టేషన్ల పరిధి లో ఎటువంటి కోడిపందేలు, పేకాట,ఆన్లైన్ బెట్టింగ్ , అక్రమ ఇసుక రవాణా మొదలయినవి నిర్వహిస్తే పోలీసు అధికారులకు తెలియజేయాలని వారి వివరాలు వారికి గోప్యంగా ఉంటాయని ఏసీపీ ప్రకటించారు.

# కొడంగల్ రైతు సేవల ఉత్పత్తిదారుల కంపెనీకి CGI సహకారం

- 3 సంవత్సరాల పూర్తి సందర్భంగా సమీక్షా సమావేశం
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న CGI సంస్థ ప్రతినిధులు పి.కిరణ్ కుమార్, సంతాన గోపాల్
- 300 మంది మహిళా సేంద్రియ రైతులతో విజయవంతమైన సమీక్ష









**కొడంగల్ మండలం, ఫిబ్రవరి,21(సమయం న్యూస్) :** కొడంగల్ రైతు సేవల ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌కు కి CGI సంస్థ సహకారం 3 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, 300 మంది మహిళా సేంద్రియ రైతులతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో, రైతుల సమగ్ర భాగస్వామ్యంతో జరిగింది.

**మూడు సంవత్సరాలుగా ఆర్థిక మద్దతు -- CGI సంస్థ పాత్ర**

గత మూడు సంవత్సరాలుగా CGI సంస్థ సేంద్రియ వ్యవసాయం ప్రోత్సాహానికి ఆర్థిక సహకారం అందిస్తోంది. ఈ ప్రాజెక్టు మార్చి నెలతో ముగియనున్న నేపథ్యంలో, ఇప్పటివరకు సాధించిన పురోగతిని సమీక్షిస్తూ రైతులతో చర్చలు జరిపారు. ఈ సమావేశానికి CGI సంస్థ ప్రతినిధులు పి. కిరణ్ కుమార్ మరియు సంతానగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరై, మహిళా రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి, అందిన సహకారం ప్రభావాన్ని తెలుసుకున్నారు.

**అధ్యక్షురాలి అభిప్రాయం -- విస్తరిస్తున్న సేంద్రియ సాగు**

సంస్థ అధ్యక్షురాలు ఎడిగి నాగమ్మ మాట్లాడుతూ, మూడు సంవత్సరాలుగా 300 మంది మహిళా రైతులకు బయో ఫర్టిలైజర్లు, బయో పెస్టిసైడ్లు, మార్కెట్ ప్రీమియం మరియు శిక్షణలు అందించడం వల్ల ప్రతి రైతు కనీసం ఒక ఎకరంలో సేంద్రియ వ్యవసాయం చేపట్టారని తెలిపారు. భవిష్యత్తులో ఈ విస్తీర్ణాన్ని రెండు ఎకరాలకు పెంచే సంకల్పం వ్యక్తం చేశారు. అదేవిధంగా, మరిన్ని 300 మంది రైతులు సేంద్రియ వ్యవసాయానికి ఆసక్తి చూపుతున్నారని పేర్కొంటూ CGI సహకారం నిరంతరంగా కొనసాగాలని కోరారు.

**మహిళా సాధికారతకు దోహదం చేసిన పారిశ్రామిక కార్యక్రమాలు**

సేంద్రియ వ్యవసాయం తో పాటు 60 మంది మహిళలతో ఔశీఎవఅ జుత్తీవజూతీవఅవబతీంష్ట్రఅజూ కార్యక్రమం అమలు చేయడం ద్వారా వారు ప్రొడ్యూసర్ కంపెనీలో సిబ్బంది, పాలకవర్గ సభ్యులుగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. మిగిలిన మహిళలు చిన్నతరహా వ్యాపారాలు ప్రారంభించి స్వయం ఉపాధి పొందుతున్నారు. ఈ విజయానికిCGI సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

**పంటల ప్రదర్శన -- రైతుల ప్రతిభకు నిదర్శనం**

సమావేశ ప్రాంగణంలో రైతులు పండించిన పంటలు మరియు ప్రాసెసింగ్ చేసిన ఉత్పత్తులను స్టాల్స్ రూపంలో ప్రదర్శించారు. అనంతరం గ్రామాలు, పొలాలను సం దర్శించిన CGIప్రతినిధులు రైతుల పనితీరును అభినందించి, మరింత ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు.

**డెయిరీ యూనిట్లకు రుణాలు -- బ్యాంకు హామీ**

సమావేశంలో Telangana Grameena Bank సిబ్బంది పాల్గొని, మహిళలు సమూహంగా సమర్థవంతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున డెయిరీ యూనిట్ల స్థాపనకు రుణాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

**భవిష్యత్ దిశ -- అగ్రి ప్రాసెసింగ్ జోన్, బయో ఇన్‌పుట్ యూనిట్ మరియు డెయిరీ ఏర్పాటు**

కంపెనీ జనరల్ మేనేజర్ మొహమ్మద్ వసీమ్ మాట్లాడుతూ, భవిష్యత్తులో ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో అగ్రి ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటు చేసి రైతులు పండించిన పంటలకు విలువాధిక్యం కల్పించి వాటిని "జతీవఎశీబ" బ్రాండ్ ద్వారా మార్కెట్లోకి తీసుకెళ్లే ప్రణాళిక ఉందని తెలిపారు. అదేవిధంగా నాణ్యమైన బయో ఫర్టిలైజర్ల తయారీ కోసం బయో ఇన్‌పుట్ యూనిట్ మరియు డెయిరీ ప్రాసెసింగ్ యూనిట్ స్థాపనకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు నాగమ్మతో పాటు వెంకటమ్మ, నర్సమ్మ, భీమమ్మ, అమూర్తమ్మ, సిబ్బంది అబ్దుల్ రజాక్, చంద్రకళ, నీళమ్మ, విశ్వజ, జనరల్ మేనేజర్ మొహమ్మద్ వసీమ్, ూాఎఎవం ూఱజవశ్రీఅష్ట్రశీశీం సంస్థ ప్రతినిధులు కృష్ణగోపాల్, రాకేష్, భావ్య పాల్గొన్నారు. CGI సంస్థ నుంచి పి. కిరణ్ కుమార్, సంతానగోపాల్ ఏజి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొత్తం 300 మంది మహిళా సేంద్రియ రైతులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

- అర్ధరాత్రి వరకు కొనసాగిన మ్యాచులు
- ప్రీ క్వార్టర్ ఫైనల్ చేరిన నారాయణపేట జిల్లా మహిళల,పురుషుల జట్లు



**మక్తల్ మున్సిపల్,(మం) ఫిబ్రవరి,21(సమయం న్యూస్) :** గ్రామాల్లో ఉన్న ప్రతిభను వెలికితీసి దేశానికి నైపుణ్యం గల క్రీడాకారులను అందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న సీఎం కప్ రెండవ ఎడిషన్ లో భాగంగా నారాయణపేట జిల్లా మక్తల్ డిగ్రీ కళాశాల మైదానంలో నిన్నటి నుండి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి అర్ధరాత్రి వరకు మ్యాచ్ లు కొనసాగాయి. రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి 66 టీంలు సుమారు 1200మంది క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొంటున్నారు. నారాయణపేట జిల్లాలో మొదటిసారిగా మక్తల్ పట్టణంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈపోటీలు విజయవంతం కోసం నారాయణపేట జిల్లా యువజన క్రీడ సమైక్య ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

**ఆకట్టుకున్న నారాయణపేట జిల్లా మహిళ,పురుషుల టీంలు**

నారాయణపేట జిల్లా మహిళల మరియు పురుషుల జట్లు ఆడిన మ్యాచ్ లను అద్భుతంగా ఆడి అన్ని ఆటలో ప్రత్యర్థ టీంలను ఓడించి ప్రీ క్వార్టర్ ఫైనల్ కు చేరుకున్నాయి. ఉత్కంఠభరితంగా జరుగుతున్న పోటీలను తిలకించేందుకు క్రీడాభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి ఆటగాళ్లను ప్రోత్సహించారు. మ్యాచ్ లను తిలకించడానికి వచ్చిన అభిమానుల కోసం గ్రౌండ్ లో ప్రత్యేక ఏర్పాట్లను జిల్లా యూవజన క్రీడ సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన స్పోర్ట్స్ అధికారి వెంకటేష్ శెట్టి,స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి,జిల్లాలోని పిడి లు నర్సిములు, రత్నయ్య, బాలరాజ్ గౌడ్,వెంకటప్ప,రామకృష్ణ రెడ్డి,అనంత సేన,ఊసు రవి,శ్రీధర్ గౌడ్,సాయినాథ్, మౌలాలి,రాజేశ్వరి, పరంజ్యోతి, రాజశేఖర్, నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్, ఈశ్వర్,నరేష్,రూప, స్వరూప,రేణుక,పర్వీన్ బేగం మిగితా పిఈటి లు పాల్గొన్నారు

# టేకులగడ్డ తండాలో తల్లిదండ్రుల--ఉపాధ్యాయుల సమావేశం

- టీచర్,తల్లిదండ్రులు,విద్యార్థుల మధ్య పరస్పర అవగాహన,సమావేశం-
- హెచ్‌ఎం గౌరారం గోపాల్




**బొంరస్ పేట మండలం, ఫిబ్రవరి,21(సమయం న్యూస్) :** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల టేకులగడ్డ తండాలో ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశంలో హెచ్‌ఎం గౌరారం గోపాల్ మాట్లాడుతూటీచర్, తల్లిదండ్రులు, విద్యార్థుల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడం కోసం నేటి సమావేశాన్ని ఏర్పరచడం జరిగిందని అన్నారు. అనంతరం విద్యార్థుల విద్యా ప్రగతి, ప్రవర్తనపై చర్చించి అభివృద్ధి చేయడం అంశాలపై చర్చించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై సమీక్షిస్తూ పిల్లల ప్రగతిపై చిన్న ప్రదర్శన (Gallery Walk) ద్వారా చూపించడం. పిల్లల సాధనల గోడ (Achievement Wall) / ప్రదర్శనలు. FLN (Foundational Literacy & Numeracy) కార్యక్రమంపై అవగాహన కల్పించడం జరిగింది. విద్యా అంశాలు (EDUCATE) -- 20 నిమిషాలు"ఈ సంవత్సరం గడిచిన విద్యా సంవత్సరం (1 నుండి 5 తరగతులు)" పై చర్చిస్తూ విద్యా ఫలితాలు,తరగతి ,హాజరు,రాయడం, నైపుణ్యంసంఖ్యా నైపుణ్యం,విద్యార్థి ప్రవర్తన అంశాలను చర్చిస్తూ ఇంటి వద్ద పిల్లల అభ్యాస పద్ధతులను పాటించాలని తెలియజేశారు. సమావేశంలో తల్లిదండ్రుల సూచనలు, అభిప్రాయాలు స్వీకరిస్తూ. శక్తివంతం (EMPOWER) --10 నిమిషాలుతల్లిదండ్రుల సహకారంతో పిల్లల అభ్యాసాన్ని మెరుగుపరచే చర్యలు. ఇంటి వద్ద అభ్యాస పర్యవేక్షణ విధానం. పిల్లలపై సానుకూల ప్రోత్సాహం అంశాలను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమములో గ్రామ సర్పంచ్ గ్రామ పాలన, అధికారి తల్లిదండ్రులు పాల్గొన్నారు

# ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌తో మర్యాదపూర్వక భేటీ



**రాయపోల్, ఫిబ్రవరి 21:** మర్కుక్ మండలంలోని ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ను శనివారం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, రాయపోల్ బిఆర్‌ఎస్ పార్టీ మండల నాయకుడు రాజేశ్వర్ రెడ్డి లు కేసీఆర్‌ను కలిసి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# యశోదాలో అరుదైన, కష్టతర ఆపరేషన్ సక్సెస్




**ఖమ్మం, ఫిబ్రవరి 21: (సమయం న్యూస్)** ఇటీవల రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మలక్ పేట యశోద సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అరుదైన కష్టతర ఒక ఆపరేషన్ ను విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పిటల్ కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సూరిశెట్టి భరత్ కుమార్ తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం ప్రాంతానికి చెందిన వివాహిత మరముల్ల ప్రియాంక (33)ను ఆమె భర్త గత సంవత్సరం జూన్ 12న తమ ఆస్పత్రికి వాంతులు, విరేచనాలు, కండరాల బలహీనత వంటి లక్షణాలతోబాధపడుతుండగా తీసుకువచ్చారని పేర్కొన్నారు. తీవ్రమైన పొటాషియం లోపం, శారీరక అస్థిరత ఆమెలో కనిపించిందని, ఎలక్ట్రోలైట్ అసమతూల్యతలు, ఆటో ఇమ్యూన్ సంబంధిత మెటబాలిక్ వ్యాధులు సకాలంలో చికిత్స చేయకపోతే ప్రాణాపాయానికి దారి తీసే అవకాశం ఉంటుందని అన్నారు. హైపోకలేమిక్ పిరియాడిక్ ప్యారాలిసిస్ వంటి వ్యాధులు, ముత్రపిండ సమస్యలు ఆటో ఇమ్యూన్ కలిసి వస్తే నరాల వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని ప్రకటించారు. ఇలాంటి క్లిష్ట, కష్ట అరుదైన పరిస్థితులలో ముందస్తు గుర్తింపు, సమగ్ర వైద్య సమీక్ష, వివిధ విభాగాల సమన్వయంతో ఇటువంటి పేషెంట్ కు చికిత్స అత్యంత అవసరం అని వివరించారు. తమ ఆస్పత్రిలో అనుభవజ్ఞులైన న్యూరాలజీ, నెఫ్రాలీ, రుమటాలజీ, క్రిటికల్ కేర్, జనరల్ మెడిసిన్ ల సమన్వయంతో ఈ అరుదైన కష్టతర ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించామని అన్నారు.

# చెత్త ను బల్దియా ట్రాక్టర్ లకు అందజేయాలి

- నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి
- వార్త ఆఫీస్ గల్లి, బీట్ బజార్ లో శానిటేషన్ తనిఖీలు



**వరంగల్ ఫిబ్రవరి21( సమయం న్యూస్):** దుకాణదారులు చెత్త ను బల్దియా కు చెందిన చెత్త తరలింపు ట్రాక్టర్ లకు అందజేయాలని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అన్నారువరంగల్ పరిధి ఎం జీ ఏం సమీపంలో గల వార్త ఆఫీస్ గల్లి, బీట్ బజార్ ప్రాంతాలలో శనివారం మేయర్ క్షేత్రస్థాయిలో డ్రైన్ క్లీనింగ్ ను పరిశీలించి సమర్థవంతంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా మేయర్ స్థానిక వ్యాపారులతో మాట్లాడుతూ దుకాణ దారులు చెత్తను డ్రైన్ లలో వేయకుండా అక్కడకు వచ్చే బల్దియా చెత్త తరలింపు ట్రాక్టర్లకు మాత్రమే అందజేయాలని ఇందుకోసం ప్రతి దుకాణదారుడు ప్రత్యేకంగా చెత్త డబ్బాను ఏర్పాటు చేసుకొని అందులో వేసి తమ వద్దకు వచ్చే ట్రాక్టర్లకు అందజేయాలని యాజమాన్యాలకు అవగాహన కలిగించారు. అనంతరం బీట్ బజార్ ప్రాంతంలో క్షేత్ర స్థాయిలో సందర్శించి ఈ ప్రాంతం లో డ్రైన్ సమీపం లో నీరు నిలిచి ఉండడాన్ని గమనించిన మేయర్ డ్రైన్ ను పరిశీలించి మురికి నీరు నిలిచి ఉండకుండా క్లియర్ చేయాలని, జవాన్ లకు అందజేసిన రిజిస్టర్ లో సూచించిన అంశాల అనుగుణం గా చేపట్టిన చర్యలను నమోదు చేయాలని మేయర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డా.రాజేష్ సానిటరీ సూపర్వైజర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

# అగ్గనూర్ వాగు నుండి అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత..

- పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసిన ఎస్సై విఠల్ రెడ్డి



**యాలాల మండలం, ఫిబ్రవరి,21(సమయం న్యూస్) :** యాలాల ఎస్సై విఠల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నమ్మదగిన సమాచారం మేరకు అగ్గనూరు వాగు నుండి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం రాగా మా యాలాల పోలీస్ బృందం అక్కడికి వెళ్ళగా మూడు ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక రవాణా చేయిస్తున్నట్టు గమనించి వాటిని పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి సీజ్ చేసి కేసు నమోదు చేసి ఇట్టి టక్టర్ల ఓనర్లను తెలుసుకొనగా అగనూరు గ్రామానికి చెందిన విగా గుర్తించనైనది. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని యాలాల ఎస్సై విఠల్ రెడ్డి తెలపడం జరిగింది.

# సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణ

- తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి
- హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి ద జిల్లాల అధికారులతో సమీక్షా సమావేశం



**హనుమకొండ: ఫిబ్రవరి21( సమయం న్యూస్) :** బాలల హక్కుల పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం రోజున హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ , విద్యా, వైద్యారోగ్య, కార్మిక, పోలీస్ శాఖల అధికారులు, బాలల న్యాయ మండలి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ తో నిర్వహించిన సమీక్షా సమావేశాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం రోజున కమిషన్ సందర్శనలో ఆనేక సమస్యలు గుర్తించామని ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం లేదని, హనుమకొండ, వరంగల్ డీఈవోలు సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో గర్భిణీలు, బాలింతలు, ఇమ్యూనైజేషన్ స్టేటస్ వివరాలను అందించాలని హనుమకొండ డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్యను ఆదేశించారు. బాలల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. అదేవిధంగా బాల్య వివాహాలు చేసే కుటుంబాలను ముందుగానే గుర్తించి వాటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని, బాల్య వివాహాలపై నివేదికను అందజేయాలని జిల్లా సంక్షేమ అధికారులకు తెలియజేశారు. త్వరలో బాల్య వివాహ నిషేధ చట్టంపై, బాల్య వివాహాల నిర్మూలనపై, పోక్సో చట్టం పై పెద్ద ఎత్తున అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలో బాలల కోసం ప్రత్యేకంగా స్టూడెంట్ వెల్నెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీని ద్వారా వారి మానసిక వికాస స్థాయిలను గుర్తించి అవసరమైన వారికి ఆత్మస్థైర్యాన్ని కల్పించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బాలల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

బాలల పరిరక్షణ కమిషన్ సభ్యులు బృందాలుగా మూడు జిల్లాల్లో పర్యటించిన సందర్భంగా వారు గుర్తించిన అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. బాలల పరిరక్షణ కమిటీ చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డికి జిల్లా కలెక్టర్ జ్ఞాపికను అందజేశారు. ఈ సమీక్షా సమావేశంలో కమిషన్ సభ్యులు మరిపల్లి చందన, బండి అపర్ణ, కంచర్ల వందన గౌడ్, వచన్ కుమార్, ప్రేమలత అగర్వాల్, డీఆర్వో వైవీ గణేష్, ఆర్జేడీ ఝాన్సీ లక్ష్మీ బాయి , జిల్లా సంక్షేమ అధికారులు విశ్వజ, మల్లీశ్వరి, డిఎంహెచ్వోలు డాక్టర్ అప్పయ్య, డాక్టర్ సాంబశివరావు, అడిషనల్ డీసీపీ ఎన్ రవి, భూపాలపల్లి ఆడిషనల్ ఎస్పీ నరేష్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్పర్సన్ లు అనిల్ చందర్ రావు, వసుధ, బాలల న్యాయ మండలి సభ్యులు డాక్టర్ కే గోపికా రాణి, ఎం సుభాష్, ఇంచార్జి డిసిపివోలు ఎస్ ప్రవీణ్ కుమార్, ఉమ, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ భాస్కర్, జి తిరుపతి, కార్మిక శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణ పనులు వేగవంతం చేయాలి...



**సూర్యాపేట ఫిబ్రవరి21( సమయ్దం న్యూస్) :** ఆర్డీవోలు, తాసిల్దార్లు,ఆర్అండ్ బి, ఇరిగేషన్, టీజీ ఐఐసి, రైల్వేశాఖ, పంచాయతీరాజ్ ఇంజనీర్స్ లతో వేబేక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూర్యాపేట జిల్లాలో నిర్మించతలపెట్టిన వివిధ ప్రాజెక్టులకు కావలసిన భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, తాసిల్దార్లు, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, టీజీ ఐఐసి, రైల్వే శాఖ, పంచాయతీరాజ్ అధికారు లతో భూ సేకరణ పనుల పై వేబేక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు ఈ సందర్భంగా కలె క్టర్ మాట్లాడుతూ ఇరిగేషన్ ప్రాజెక్టులు, రైల్వే ప్రాజెక్టులు, ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ ప్రాజెక్టులు మరియు వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణ మరియు పెండింగ్ లో ఉన్న భూసేకరణ పనులు త్వరితగతిన నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె. సీతారామా రావు, సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ్, సూపర్డెంట్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో "రైతుబడి అగ్రి షో"లో భూపాలపల్లి రైతుల సందర్శన





**భూపాల పల్లి ఫిబ్రవరి21( సమయం న్యూస్). :** శనివారం భూపాలపల్లి, కాటారం డివిజన్ పరిధిలో ఉద్యాన పంటలను సాగు చేస్తున్న రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించే లక్ష్యంతో జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎ. సునీల్ కుమార్ ఆధ్వర్యంలో 50 మంది రైతులను హైదరాబాద్‌లో జరుగుతున్న "రైతుబడి అగ్రి షో"కు తీసుకువెళ్లారు. ఈ అగ్రి షోలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను రైతులు సందర్శించి, వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న ఆధునిక పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ విధానాలపై అవగాహన పొందారు. ముఖ్యంగా వ్యవసాయంలో డ్రోన్స్ వినియోగం, ఆధునిక టెక్నాలజీ, స్మార్ట్ ఇరిగేషన్ సిస్టమ్స్, విత్తనాలు ఎంపిక, ఎరువుల వినియోగ విధానాలు, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే సాంకేతిక పద్ధతులను పరిశీలి ంచారు .వ్యవసాయంలో వినియోగిస్తున్న వివిధ యంత్రాలు, పరికరాలు, పంట సంరక్షణలో ఉపయోగించే డ్రోన్లు, విత్తన కంపెనీల ప్రదర్శనలు రైతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రైతులు నూతన సాంకేతికతను తమ పంటల్లో అమలు చేయాలనే ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎ. సునీల్ కుమార్ మాట్లాడుతూ, రైతులు ఆధునిక సాంకేతికతను అవలంబిస్తే తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఇలాంటి అగ్రి షోలలో పాల్గొనడం రైతులకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాదేవ పూర్ ఉద్యాన అధికారి వై. మణి, విస్తరణ అధికారి రామ్ దాస్, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- గ్రామాలలో సర్పంచ్ లు సుపరిపాలన అందించాలి



**ఖమ్మం, ఫిబ్రవరి21: ( సమయం న్యూస్ ) :** గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. డి.పి.ఆర్.సి. సెంటర్ లో నూతన సర్పంచ్ లకు ఏర్పాటు చేసిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో గ్రామాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ లకు పెద్ద బాధ్యత ఉంటుందని, రాబోయే 5 సంవత్సరాల పాటు బాధ్యత బాగా నిర్వర్తించా లని కలెక్టర్ సూచించారు. సర్పంచ్ విధి నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యలు, కార్యచరణపై ఫిబ్రవరి 17 నుంచి 21 వరకు 5 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ అందించడం జరిగిందని అన్నారు. పంచాయతీ కనీస బాధ్యతలు కట్టుదిట్టంగా నిర్వహిస్తే, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తారని కలెక్టర్ అన్నారు. గ్రామ పారిశుధ్యం పరిశీలించి గ్రామ సర్పంచ్, పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శి పనితీరు చెప్పవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రతి రోజు చెత్త సేకరణ సజావుగా జరుగుతుందా, పారిశుద్ధ్య నిర్వహణ ఎలా ఉంటుంది అనే అంశాన్ని సర్పంచ్ పర్యవేక్షించాలని అన్నారు. గ్రామాలలో పచ్చదనం పెంచేందుకు కృషి చేయాలని అన్నారు. గ్రామ అభివృద్ధి పనులు ప్రణాళిక ప్రకారం చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీ దగ్గర అందుబాటులో ఉన్న నిధులు ఎలా ఖర్చు చేయాలో పటిష్ట కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని అన్నారు. పంచాయతీ పాలక వర్గం సమావేశాలు రెగ్యులర్ గా నిర్వహించి తీసుకున్న నిర్ణయాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలన్నారు. గ్రామ సర్పంచ్ లు అధికారులతో సమన్వయంతో పని చేస్తూ గ్రామసమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉండాలని, సర్పంచ్ గా గెలిచిన తర్వాత గ్రామంలో అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పని చేస్తేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు. గ్రామాలలో పన్ను వసూలుపై సర్పంచ్ శ్రద్ధ పెట్టాలని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పన్ను కట్టేలా ప్రజలను ప్రోత్సహించాలని, పన్ను ఎగవేత ఎట్టి పరిస్థితుల్లో సహించ వద్దని, పాత పన్ను బకాయిలు కూడా వసూలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. మన గ్రామాలను దేశంలో అత్యుత్తమ గ్రామాలుగా తీర్చిదిద్దుతూ జాతీయ స్థాయి అవార్డులు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పంచాయతీ పాలనపై సర్పంచ్ పట్టు సాధిస్తే అభివృద్ధి మరింత మెరుగ్గా సాధ్యం అవుతుందని అన్నారు. ఆర్థిక సంఘం నిధులు 33 కోట్ల రూపాయలు జిల్లాలో గ్రామ పంచాయతీ లలో జమ అయ్యాయని, వీటిలో 20 కోట్ల రూపాయలు గ్రామాలలో పారిశుధ్య, పంచాయతీ సిబ్బంది వేతనాలు, విద్యుత్ బిల్లులు వంటి టైడ్ గ్రాంట్ నిధులు, 13 కోట్ల రూపాయలు అభివృద్ధి నిధులు ఉన్నాయని, మార్చి 31 వరకు మరిన్ని నిధులు జమ అవుతాయని కలెక్టర్ తెలిపారు. ఆర్థిక సంఘం నిధులను దుబారా చేయకుండా సక్రమంగా వాడుకునేందుకు గ్రామ పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్ తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణం మాత్రమే అభివృద్ధి కాదని, గ్రామాలలో మెరుగైన పారిశుద్ధ్యం, పచ్చదనం పెంచడం వంటి పనులు కూడా అభివృద్ధి అవుతాయని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో ప్రభుత్వ పథకాల అమలు తీరు కూడా సరిగా అవుతుందో లేదో దృష్టి పెట్టాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి రాంబాబు, అధికారులు, గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

# ముల్కనూరులో లో ఉచిత మెగా వైద్య శిబిరం

- వైద్య శిబిరాన్ని సందర్శించి న హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్




**ముల్కనూర్ ఫిబ్రవరి21( సమయం న్యూస్). :** హనుమకొండ : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారి ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్క నూర్ లో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కలెక్టర్ శ్రీమతి స్నేహ శబరీష్ సందర్శించారు హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జనగామ ప్రభుత్వ వైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండల ప్రజల కోసం స్థానిక మోడల్ స్కూల్లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సందర్శించారుమెగా వైద్య శిబిరంలో ఓపి నమోదు, ,ప్రాథమిక పరీక్షల కౌంటర్లను ,కలెక్టర్ పరిశీలించారు. జనరల్ ఫిజీషియన్ విభాగాలతోపాటు ఎముకలు, శస్త్ర చికిత్స, పిల్లలు, చెవి ముక్కు గొంతు, చర్మవ్యాధి, కంటి, స్త్రీ వైద్య నిపుణులు వైద్య సేవలను , ఈసీజీ మరియు ఎక్సరే పరీక్షలు నిర్వహిస్తుండగా కలెక్టర్ సందర్శించి ఆయా విభాగాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ కౌంటర్ ను కలెక్టర్ సందర్శించి అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందించాలని వైద్యులకు సూచించారు. అలాగే హాజరైన సర్పంచులను వారి వారి గ్రామాల నుండి ఎంతమంది ఏ సమస్యలతో రావడం జరిగిందో అడిగి తెలుసుకున్నారు. జనగామ వైద్య కళాశాల, జిల్లా ఆసుపత్రి జనగామకు చెందిన (8 )విభాగాల నుండి స్పెషలిస్ట్ వైద్యులు ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. ముల్కనూర్ ,వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని డాక్టర్లు ఏఎన్ఎంలు, ఆశా లు , మహిళా సమాఖ్య సభ్యులు , గ్రామ కార్యదర్శులు సంబంధిత గ్రామ ప్రజలను గుర్తించి శిబిరానికి పంపించగా వివిధ విభాగాల వైద్యులు పరీక్షించారు. ఈ శిబిరంలో 14 మంది స్పెషలిస్ట్ వైద్యులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుండి డాక్టర్లు సూపర్వైజర్లు,ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసీ ఆఫీసర్లు , రేడియోగ్రాఫర్లుపారా మెడికల్ సిబ్బంది , ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు మొత్తం (75)మందిలపాల్గొన్నారు. అలాగే ప్రజలకు వివిధ ఆరోగ్య అంశాల పట్ల, ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన అవగాహన ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరికి బీపీ తో పాటు అవసరమైన వారికి షుగర్ , హిమోగ్లోబిన్ పరీక్షలను అక్కడే నిర్వహించగా ఇతర ల్యాబ్ పరీక్షలకు నమూనాలు సేకరించి తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్ లో పరీక్షల నిమిత్తం పంపించారు. ప్రత్యేకంగా మొబైల్ ఎక్స్రే మరియు ఈసీజి ఏర్పాటు చేయడం జరిగింది ప్రజ లు ఆరోగ్యంగా ఉండాలని , స్థానికంగా అందుతున్న వైద్యంతో పాటు, స్పెషలిస్ట్ వైద్య సేవలు అవసరం ఉండి పనుల ఒత్తిడి వల్ల అలాగే వైద్య పరీక్షలకుటెస్టులకు అదనంగా డబ్బులు వెచ్చించలేక పట్టణాలకు వెళ్లలేక పోతు న్న వారి కోసం మండల కేంద్రంలో వారికి అందు బాటులో వైద్య సేవలు అందించాలని ఉద్దేశ్యంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో (310)మందికి ఒక్కరికి దాదాపుగా 1800 రూపాయల విలువైన ల్యాబ్ పరీక్షలు చేయడం జరిగింది. 5 లక్షల పైగా విలువచేసే మందులను పంపిణీ చేయడం జరిగింది. డి ఎం హెచ్ ఓ గారి విజ్ఞప్తి మేరకుజిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసి యేషన్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ మృత్యుంజయ రెడ్డి దాదాపుగా ఒక లక్షరూపాయల విలువైన మందులు అందించడం జరిగింది. మొత్తం వైద్య శిబిరంలో ( 863)వైద్య సేవలు అందుకోగా అందులో జనరల్ మెడిసిన్ (. 284)ఎముకలవైద్యానికి సంబంధించి ( 143)పిల్లలకు సంబంధించిన సమస్యలు ( 93)చర్మవ్యాధి సమస్యలు ( 44)చెవి ముక్కు గొంతు సంబంధిత సమ స్యలు ( 49)జనరల్ సర్జరీ ( 26)స్త్రీలకు సంబంధించిన సమస్యలు(. 34)కంటి సమస్యలకు (190)చికిత్స అందించడం జరిగింది. అలాగే మరింత మెరుగైన పరీక్షలు చికిత్స నిమిత్తం (12 ) మందిని ఎంజీఎం ఆసుపత్రి, జిఎంహెచ్ లకు (18) క్యాటరాక్ట్ ఆపరేషన్ నిమిత్తంలరిఫర్ చేయడం జరిగింది(. 89 ) ఎక్స్ రే మరియు (40) ఈసీజీ పరీక్షలు. లాబ్ పరీక్షలు (310)నిర్వహించడం జరిగిందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ. అప్పయ్య తెలియజేశారు. దృష్టిలోపాలున్న (54) మంది కి పెద్ది వసంత ఫౌండేషన్ ద్వారా అద్దాలు అందజేయడం. జరుగుతుందని శ్రీ పెద్ది వెంకటనారాయణ గౌడ్ తెలియజేశారు డిఎంహెచ్వో డాక్టర్ ఏ అప్పయ్య, స్థానిక సర్పంచ్ శ్రీ. ప్రమోద్ రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీ. కే.మమత, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ శ్రీ పెద్ది వెంకటనారాయణ గౌడ్, వంగర సర్పంచ్ గజ్జల సృజన రమేష్, ఎర్రబెల్లి సర్పంచ్ కాలేరు శ్రవణ్ విశ్వనాథ కాలనీ సర్పంచ్ కస్తూరి సుధాకర్, ధర్మారం సర్పంచి గోప గోని తిరుపతి, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హి మబిందు, స్థానిక తహసిల్దార్ రాజేష్ ఎంపీడీవో వీరేశం ,జనగామ నుండి డాక్టర్ డాక్టర్ సంజీవయ్య,. డాక్టర్ హై మావతి డాక్టర్ సుప్రియ ,డాక్టర్ శ్వేత డాక్టర్ మానస్ , డాక్టర్ ఉదయ్. డాక్టర్ సుష్మ డాక్టర్ ప్రశాంత్ ,, డాక్టర్ వర్షిణి, ముల్కనూరు, వంగర ఎల్కతుర్తివైద్యాధికారులు డాక్టర్ స్వప్న ,డాక్టర్ రెహమాన్ ,డాక్టర్ రాజశేఖర్ , డాక్టర్ భార్గవ్ డాక్టర్ సురేష్,, పల్లెదవ ఖానా వైద్యాధికారులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీ రెహమాన్ ,డెమో వి అశోక్ రెడ్డి , ఎజూ లువరాజేశ్వర్ రెడ్డి మోహన్,పాల్గొన్నారు.

# ఎలెక్టర్ మ్యాపింగ్ పరిశీలన

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**ఉట్నూరు మండలం, ఫిబ్రవరి,21(సమయం న్యూస్)** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)లో భాగంగా జిల్లా కలెక్టర్ శ్రీమతి సిక్తా పట్నాయక్ శనివారం ఉట్నూరు మండల తహశీల్ కార్యాలయమునకు వెళ్లి మండలం యొక్క ఎలెక్టర్ మరియు ప్రాజెనీ మ్యాపింగ్ తహసీల్దార్ చింత రవి ,బూత్ లెవెల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు అనంతరం మండలం యొక్క ప్రోగ్రెస్ పరిశీలన చేశారు. మండలం యొక్క ప్రోగ్రెస్ తనిఖీ చేస్తూ ఎలెక్షన్ కమిషన్ నిబంధనల మేరకు మ్యాపింగ్ చేయాలని,పెండింగ్ ఉన్న పోలింగ్ కేంద్రాల్లో త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు... అనంతరం త్వరగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ మరియు ఇందిరమ్మ ఇళ్ల పూర్తి చేయాలని ఎంపిడిఓ కిషోర్ కుమార్ మరియు వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు

## విద్యార్థిని,విద్యార్థులకు న్యాయ విద్యపై అవగాహన



**కొడంగల్ మున్సిపల్, ఫిబ్రవరి,21(సమయం న్యూస్) :** కొడంగల్ ప్రభుత్వ డీగ్రీ కళాశాల లో కళాశాల ఎన్. ఎస్. ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో, ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన, మండల న్యాయ సేవాధికార సంస్థ, కొడంగల్ సౌజన్యం తో విద్యార్థులకు న్యాయ విద్యపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కొడంగల్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టుకు చెందిన సి. సునీత మరియు జెస్సికా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సంఘటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ర్యాగింగ్, గృహహింస, వరకట్న దురాచారం, కుల వైషమ్యాలు, కిడ్నాప్, మానవ అక్రమ రవాణా, వంటి సందర్భాల్లో అనుసరించాల్సిన విధానాలపై, ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్. ఐ. ఆర్) నమోదు చేయడం, ఇతర సందర్భాల్లో ప్రభత్వం అందించే ఉచిత న్యాయ సేవల్ని, లోక్ అదాలత్ సేవల్ని పొందే విధానాన్ని గూర్చి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల ర్యాగింగ్ రహితమని, విద్యార్థులు ర్యాగింగ్ కు దూరంగా ఉండి తమ బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రఫియా ఖానం, టి. రాంబాబు, డా. ఆర్. శ్రీనివాస్, డా. ఇ. సోమ్లా, డా కె. రమేశ్ బాబు, కె. అన్నపూర్ణ, ఇతర అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

## సఖి వన్ స్టాప్ సెంటర్ లో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం.

**జనగాం ఫిబ్రవరి21( సమయం న్యూస్). :** జనగామ జిల్లాలోని సఖి – వన్ స్టాప్ సెంటర్ లో ఖాళీగా ఉన్న ఈ క్రింది పోస్టులను అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడమైనది.

**ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు:**

1) పారా లీగల్ పర్సనల్/లాయర్( 01): న్యాయశాస్త్రంలో డిగ్రీ ఉన్నవారు/న్యాయ శిక్షణ లేదా చట్టాలపై పరిజ్ఞానం కలిగి, జిల్లా స్థాయిలో ప్రభుత్వ లేదా ప్రభుత్వేతర మహిళా సంబంధిత ప్రాజెక్ట్/కార్యక్రమంలో కనీసం 3 సంవత్సరాల పని అనుభవం లేదా ఏదైనా న్యాయస్థానంలో కనీసం 2 సంవత్సరాల అనుభవం ఉండాలి.

గౌరవ వేతనం: రూ. 25,000/-

2) కేస్ వర్కర్ (మహిళలు మాత్రమే) (01 ) లా / సోషల్ వర్క్/సోషియాలజీ/సైకాలజీలో బ్యాచిలర్ డిగ్రీ కలిగి మరియు ప్రభుత్వ లేదా ప్రభుత్వేతర ప్రాజెక్ట్/కార్యక్రమంలో మహిళలకు సంబంధించిన రంగాలలో కనీసం 3 సంవత్సరాల పని అనుభవం ఉండాలి.

స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడును.

గౌరవ వేతనం:రూ. 20,000/-

3)పారా మెడికల్ పర్సనల్ (మహిళలు మాత్రమే) (01 ): పారామెడిక్స్‌లో ప్రొఫెషనల్ డిగ్రీ/డిప్లొమా కలిగి, జిల్లా స్థాయిలో ప్రభుత్వ లేదా ప్రభుత్వేతర ఆరోగ్య ప్రాజెక్ట్/కార్యక్రమంలో

3 సంవత్సరాల పని అనుభవం ఉండాలి.

గౌరవ వేతనం: రూ. 15,000/-

**ముఖ్యమైన వివరాలు:**

ధరఖాస్తు తేదీలు: 22.02.2026 నుండి 01.03.2026 వరకు

అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా దేవాదుల క్యాంపు ఆఫీస్, సఖి – వన్ స్టాప్ సెంటర్ నందు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు సమర్పించవలెను.

**సమర్పించాల్సిన పత్రాలు :** దరఖాస్తుతో పాటు బాజ మెమో, విద్యార్హత పత్రాలు, అనుభవ ధృవీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను జత చేయాలి. తదుపరి వివరాలు అభ్యర్థులకు తెలియపరుస్తాము. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 9347186918.

ఇట్టి నోటిఫికేషన్ లో మార్పులు, చేర్పులు మరియు పూర్తిగా రద్దు చేయుటకు పూర్తి అధికారము శ్రీయుత జిల్లా కలెక్టర్ ఉ మేజిస్ట్రేట్ జనగామ జిల్లా గారికి కలదు.


## చిన్నారుల అద్భుత ప్రతిభా ప్రదర్శన

- మేధో శక్తి పెంపు.. బంగారు భవిష్యత్తుకు బాటలు

- వావ్ "బ్రిలియంట్" స్టూడెంట్స్ - తల్లిదండ్రుల ప్రశంసల జల్లు

**డోర్నకల్: ఫిబ్రవరి21( సమయం న్యూస్). :** బాల్యం నుంచి చక్కని విద్యాబుద్ధులు నేర్చుకోవడంతో ఉజ్వల భవిష్యత్తు బాటలు వేసినట్లు అవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. శుక్రవారం స్థానిక బ్రిలియంట్ పాఠశాలలో వండర్ కిడ్స్ ప్రతిభ ప్రదర్శన జరిపారు.కరస్పాండెంట్ వక్కంతుల అప్పారావు,ప్రిన్సిపల్ అప్సర చిన్నారుల ప్రతిభను పరిశీలించారు.తల్లిదండ్రుల సమక్షంలో ఉపాధ్యాయులు అడిగిన ప్రతి అంశంపై చక్కని సమాధానాలు చెప్పారు. పిల్లల్లో నాయకత్వ లక్షణాలు,దేశ,విదేశాల రాజధానులు,ప్రత్యేక ప్రదేశాల గుర్తింపు విశ్లేషణాత్మక వివరణ చిన్నారులు వెల్లడిస్తుంటే తల్లిదండ్రులు సంబుర పడ్డారు.అదేవిధంగా పలువురు తల్లిదండ్రులు జాతీయ, అంతర్జాతీయ ప్రశ్నలు సంధించారు.పిల్లలుఅత్యంత వేగంగా సమాధానాలు చెప్పారు. ఉపాధ్యాయులకు,యజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కలెక్టర్ తో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి భేటీ



**ఖమ్మం:** పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని శనివారం కలిశారు. వీ.వెంకటాయపాలెం వద్ద గల ఐడిఓసికి వెళ్లగా అదనపు కలెక్టర్ పీ. శ్రీనివాసరెడ్డి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్ లో అనుదీప్ దురిశెట్టితో భేటీ అయ్యారు. ఎంపీ నిధుల పనుల పురోగతిపై ఆరా తీశారు. ఇంకా.. కొత్తగా చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలు తెలుసుకున్నారు. ఈజీఎస్ పనులు వేగవంతంగా పూర్తి చేయించాలని సూచించారు.

## రేపు మహబూబాబాద్ జిల్లా రెడ్యాల గ్రామానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి రాక...



మహబూబాబాద్ జిల్లా రెడ్యాలలో ఇటీవల వెన్నం రాఘవేందర్ రెడ్డి గారు మృతి చెందగా వారి కుమారులు బిగ్ టివి చైర్మన్ విజయ్ కాంత్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి గార్లను పరామర్శించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబాబాద్ జిల్లాకు రానున్నారు

# ఓటర్ల మ్యాపింగ్ సర్వే వేగంగా చేపట్టాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



**హైదరాబాద్ , ఫిబ్రవరి 21( సమయం న్యూస్).:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ముందస్తు సన్నాహాల్లో భాగంగా హైదరాబాద్ లో చేపడుతున్న ఓటర్ల మ్యాపింగ్ సర్వేమరింత చురుగ్గా, వేగంగా జరిగేలా చూడాలనిను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ERO,AERO లను ఆదేశించారు.శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి , హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ తో కలిసి సికింద్రాబాద్ నియోజకవర్గంలోని మాణికేశ్వర్ నగర్ పోలింగ్ కేంద్రం 211 పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ముందస్తు సన్నాహాల్లో భాగంగా చేపట్టిన ప్రోజెన్సీ మ్యాంపింగ్ ) ను ఆకస్మికంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.అనంతరం చార్మినార్ నియోజకవర్గంలోని లో కబుత్తరు ఖానా పోలింగ్ కేంద్రం 12 పరిధిలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించారు.బూత్ లెవెల్ అధికారులు, సూపర్ వైజర్ లతో మాట్లాడారు. మ్యాపింగ్ ఎట్లా చేస్తున్నారు... అంటూ ప్రశ్నించారు. మ్యాపింగ్ పై వారికి ఉన్న అవగాహన ను పరిశీలించారు.ఇంటింటికీ వెళ్లి.. 2002 జాబితాలోని ఓటర్ల కుటుంబ సభ్యుల వివరాలను 2025 జాబితాను పోల్చుతున్నామనిదీూా లు తెలిపారు. 2002 జాబితాలో పేర్లున్న ఓటర్ల కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి... ప్రస్తుత జాబితాలో ఉంటే వారి పేర్లను మ్యాపింగ్ చేపడుతున్నట్లు తెలిపారు.ఇప్పటి వరకూ జరిగిన ప్రోజెన్సీ మ్యాంపింగ్ (progency mapping) పురోగతిని ERO,AERO లు ప్రధాన ఎన్నికల అధికారికి తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ...భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రోజెన్సీ మ్యాపింగ్ పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రోజెన్సీ మ్యాపింగ్ చురుగ్గా చేపట్టి వేగంగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల జాబితాల్లో కచ్చితత్వం, పారదర్శకత, సమగ్రతను పాటించడమే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) కార్యక్రమం చేపట్టనుందని తెలిపారు.క్షేత్ర పరిశీలనలో ప్రధాన ఎన్నికల అధికారి వెంట అదనపు కమిషనర్ ( ఎన్నికల విభాగం ) చంద్రకళ, జు=ూ లు సరిత, ఆంజనేయులు,ూజు=ూ లు సుధీర్ రెడ్డి, ఎన్నికల విభాగం సహాయ మున్సిపల్ కమిషనర్ విమల తదితరులు ఉన్నారు.

# అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం - ఫిబ్రవరి 21

**భాషలు సంరక్షించబడినప్పుడు, సంస్కృతి మరియు ఇంటి భాషలో నేర్చుకోవడం ప్రారంభమైనప్పుడు విద్య వృద్ధి చెందుతుంది. ఐక్యరాజ్యసమితి**

ఇటీవలి సంవత్సరాలలో భాషా ప్రకృతి దృశ్యం తీవ్ర మార్పులకు గురైంది, పెరిగిన వలసలు, వేగవంతమైన సాంకేతిక అభివృద్ధి మరియు బహుభాషావాదం యొక్క అభిజ్ఞా, సామాజిక మరియు ఆర్థిక ప్రయోజనాలకు పెరుగుతున్న గుర్తింపు ద్వారా ఇది రూపుదిద్దుకుంది. నేడు, బహుభాషావాదం ఒక సామాజిక వాస్తవికతగా మాత్రమే కాకుండా ప్రాథమిక మానవ లక్షణంగా మరియు శక్తివంతమైన విద్యా విధానంగా ఎక్కువగా అర్థం చేసుకోబడుతోంది. భాషలను రక్షించడం మరియు పునరుజ్జీవింపజేయడం, డిజిటల్ కంటెంట్‌ను సృష్టించడం మరియు భాషా వైవిధ్యాన్ని మరింత దృశ్యమానంగా మరియు విలువైనదిగా చేయడానికి సాంకేతికతను ఉపయోగించడం ద్వారా యువత ఈ పరిణామంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ ప్రయత్నాలు భాష, గుర్తింపు, అభ్యాసం, శ్రేయస్సు మరియు సమాజంలో పాల్గొనడం మధ్య లోతైన సంబంధాన్ని బలోపేతం చేస్తాయి, అదే సమయంలో అభ్యాసకుల భాషలను గుర్తించి మద్దతు ఇచ్చే విద్యా వ్యవస్థల అవసరాన్ని హైలైట్ చేస్తాయి.అదే సమయంలో, ప్రపంచవ్యాప్తంగా 40% మంది అభ్యాసకులు ఇప్పటికీ వారు బాగా అర్థం చేసుకునే భాషలో విద్యను పొందుపరచలేకపోతున్నందున, స్వదేశీ, వలస మరియు మైనారిటీ యువత ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. ఈ అంతరాన్ని పరిష్కరించడానికి అందరికీ చేరిక, సమానత్వం మరియు ప్రభావవంతమైన అభ్యాసాన్ని ప్రోత్సహించడానికి బహుభాషా విద్యను వాటి ప్రధాన భాగంలో పొందుపరిచే విద్యా విధానాలు మరియు అభ్యాసాలు అవసరం. కాంక్రీట్ చర్యలను ముందుకు తీసుకెళ్లడం, ఆశాజనకమైన అనుభవాలను పంచుకోవడం మరియు యువకులు, విద్యావేత్తలు మరియు విధాన రూపకర్తల మధ్య సంభాషణను పెంపొందించడం ద్వారా, ప్రపంచ చొరవలు ప్రపంచవ్యాప్తంగా పాఠశాలలు మరియు సమాజాలలో భాషా వైవిధ్యాన్ని బలోపేతం చేసే ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి మరియు పరిష్కారాలను గుర్తించడానికి స్థలాలను సృష్టిస్తాయి.అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నవంబర్ 1999లో ఐక్యరాజ్యసమితి విద్యా, శాస్త్రీయ మరియు సాంస్కృతిక సంస్థ (ఖచీజుూజూ) జనరల్ కాన్ఫరెన్స్ ప్రకటించింది. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకోవాలనే ఆలోచన బంగ్లాదేశ్ చొరవ. 2002 నాటి తీర్మానంలో ఈ దినోత్సవ ప్రకటనను ఖచీ జనరల్ అసెంబ్లీ స్వాగతించింది.మే 16, 2007న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తన తీర్మానం ూ/=జుూ/61/266లో సభ్య దేశాలకు "ప్రపంచ ప్రజలు ఉపయోగించే అన్ని భాషల పరిరక్షణ మరియు రక్షణను ప్రోత్సహించాలని" పిలుపునిచ్చింది.

థీమ్ 2026: "బహుభాషా విద్యపై యువత స్వరాలు"

భాషా వైవిధ్యాన్ని స్వీకరించే విద్యా వ్యవస్థలను నడిపించడానికి, వాటి కోసం వాదించడానికి మరియు రూపొందించడానికి యువతను శక్తివంతం చేయడంపై థీమ్ దృష్టి పెడుతుంది, మాతృభాషలను నిలబెట్టడంలో మరియు పునరుజ్జీవింపజేయడంలో వారి పాత్రను హైలైట్ చేస్తుంది.

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ శుభాకాంక్షలు...!!!

# గ్రామాలలో శాంతి భద్రతల పరిరక్షణలో సర్పంచుల పాత్ర కీలకం

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS



**నారాయణపేట, ఫిబ్రవరి,21(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన గ్రామపంచాయతీ సర్పంచుల ఓరియంటేషన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తో కలిసి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఘూ పాల్గొని సర్పంచులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశ అభివృద్ధి గ్రామం నుంచే ప్రారంభమవుతుందని, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సర్పంచుల పాత్ర అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. కుల, మత, పార్టీ భావాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. భారతదేశంలో పార్టీ భేదాలు లేకుండా ప్రజలు ఎన్నుకునే పదవులు రాష్ట్రపతి మరియు సర్పంచ్ పదవులని తెలిపారు.గ్రామాలలో శాంతి భద్రతల పరిరక్షణలో సర్పంచులు పోలీసులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని కోరారు. పిల్లలు చెడు వ్యసనాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అమలు చేస్తున్నాయని, వాటి గురించి ప్రజలకు తెలియజేయాలని తెలిపారు.అదేవిధంగా బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ బాలికల విద్య, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. త్వరలో ప్రతి గ్రామానికి పోలీసు అధికారులు ప్రత్యక్షంగా చేరుకునే ప్రత్యేక కార్యక్రమం చేపడతామని తెలిపారు. ప్రతి గ్రామంలో ఫిర్యాదుల పెట్టె (Complaint Box) ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.గ్రామాలలో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బాల్య వివాహాలను కఠినంగా అరికట్టాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బాల్య వివాహాలను సమర్థించరాదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సర్పంచులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.జిల్లా ప్రజలు, సర్పంచులు పోలీసులకు సహకరించి గ్రామాలను శాంతియుతంగా, అభివృద్ధి దిశగా నడిపించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు

# భార్య గౌరవాన్ని వేలానికి పెట్టిన భర్త..

## నీలి వెబ్‌సైట్లలో రహస్య వీడియోలు అప్‌లోడ్, రేవాలో సంచలనం

**రేవా (మధ్యప్రదేశ్):** భార్యను నీలి చిత్రాల స్టార్‌గా చూపించాలని నీచ ఆలోచనతో ఓ వ్యక్తి చేసిన దారుణం మధ్యప్రదేశ్‌లోని రేవా నగరంలో వెలుగుచూసింది. భార్య అనుమతి లేకుండా బెడ్‌రూమ్‌లో రహస్యంగా వీడియోలు చిత్రీకరించి, వాటిని నీలి వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేయడం తీవ్ర సంచలనం సృష్టించింది.పోలీసుల వివరాల ప్రకారం, భర్త గోప్యంగా చిత్రీకరించిన వీడియోలో మొదటి 12 నిమిషాల భాగాన్ని ఒక నీలి వెబ్‌సైట్‌లో పెట్టాడు. ఈ విషయం యాదృచ్ఛికంగా తెలిసిన భార్య తీవ్ర ఆవేదనకు గురైంది. వెంటనే తన తల్లిదండ్రులకు సమాచారం



అందించింది. కుటుంబ సభ్యుల సహకారంతో బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఐటీ చట్టం మరియు మహిళల గౌరవానికి భంగం కలిగించే సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు నమోదు అయిన విషయం తెలిసిన నిందితుడు ముంబైకి పారిపోయినట్లు సమాచారం. అయితే, అతని సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ట్రాకింగ్ చేపట్టిన పోలీసులు త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.ఈ ఘటన మహిళల వ్యక్తిగత గోప్యతకు విఘాతం కలిగించే తీవ్రమైన నేరమని, ఇలాంటి చర్యలు కఠిన శిక్షలకు దారితీస్తాయని పోలీసులు హెచ్చరించారు. డిజిటల్ యుగంలో సాంకేతికతను దుర్వినియోగం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, బాధితులు భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

ఈ సంఘటన స్థానికంగా ఆగ్రహాన్ని రేకెత్తించడంతో పాటు, మహిళల భద్రత, గోప్యత అంశాలపై మళ్లీ చర్చకు దారి తీసింది.




# నా స్టైలే ఇంత..

# మైండ్‌సెట్ మార్చుకోను!

### హ్యాట్రిక్ డకౌట్‌లపై అభిషేక్ శర్మ షాకింగ్ రియాక్షన్

**ఢిల్లీ:** అభిషేక్ శర్మ అంటేనే ప్రత్యర్థి జట్టుకు చుక్కలు చూయిస్తాడని నమ్మకం. ఓపెనర్‌గా రంగంలోకి దిగి బౌలర్లకు చుక్కలు చూయిస్తాడు. అయితే.. తాజాగా జరుగుతున్న టీ20 వరల్డ్ కప్‌లో మాత్రం సీన్ రివర్స్ అయ్యింది. మూడు మ్యాచుల్లో అభిషేక్ డకౌట్ అయ్యాడు. దీంతో అనేక విమర్శలను ఎదుర్కొన్నాడు అభిషేక్.. ఆదివారం దక్షిణాఫ్రికాతో జరగనున్న భారత్ తొలి సూపర్ ఎయిట్ మ్యాచ్‌కు ముందు తన ఆటతీరుపై అభిషేక్ స్పందించాడు. గత మూడు ఇన్నింగ్స్‌లలో తాను ఎలాంటి పరుగులు చేయకపోయినా సరే, తన ఆడే విధానాన్ని (ఇంటెంట్), తన ప్రిపరేషన్ ప్రాసెస్‌ను ఏమాత్రం మార్చుకోబోనని స్పష్టం చేశాడు. స్టార్ స్పోర్ట్స్ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేసిన ఓ వీడియోలో అభిషేక్ మాట్లాడుతూ.. "నేను నా బ్యాటింగ్‌ను ఎప్పుడూ ఆస్వాదిస్తాను. రెండేళ్ల క్రితమే నేను ఒత్తిడి తీసుకోవడం మానేశాను. ఎందుకంటే కేవలం ప్రాసెస్ మాత్రమే నా చేతుల్లో ఉంటుందని నేను బలంగా నమ్ముతాను. అది ప్రాక్టీస్ అయినా, ట్రైనింగ్ అయినా సరే దాన్ని నేను కచ్చితంగా చేస్తాను, భవిష్యత్తులో కూడా చేస్తూనే ఉంటాను. నా ప్రాసెస్‌ను, మైండ్‌సెట్‌ను నేనెప్పటికీ మార్చుకోను" అని తేల్చి చెప్పాడు.

ఒక బ్యాటర్ కెరీర్‌లో ఎత్తుపల్లాలు సహజమని అభిషేక్ ఈ వీడియోలో వెల్లడించాడు. ఫామ్ గురించి అనవసరమైన ఒత్తిడికి గురికావడం మానేశానని స్పష్టం చేశాడు. ఇటీవల తన ప్రదర్శన గురించి ఆందోళన చెందకుండా కేవలం తన ప్రాసెస్ పైనే దృష్టి పెడతానని తెలిపాడు. "ఎలాంటి ఒత్తిడి తీసుకోకపోవడాన్ని నేను ఎంజాయ్ చేస్తున్నాను. బ్యాటర్‌గా ఎప్పుడూ ఎత్తుపల్లాలు ఎదురవుతూనే ఉంటాయి. కొన్నిసార్లు బాగా పరుగులు చేస్తాం, కొన్నిసార్లు అస్సలు చేయలేం. కానీ, నేను కచ్చితంగా ఇలాగే, ఇదే ఉద్దేశంతో (ఇంటెంట్) ఆడాలని వ్యక్తిగతంగా ఒక దశలో నిర్ణయించుకున్నాను. ఇది అన్ని సందర్భాల్లోనూ నాకు సానుకూల ఫలితాలను ఇవ్వకపోవచ్చు, కానీ నా ఇంటెంట్ లేదా ప్రాసెస్‌ను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చుకోబోను" అని వివరించాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోను చూసిన అభిమానులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు అభిషేక్ వ్యాఖ్యలను సమర్థిస్తుంటే.. మరి కొందరు మాత్రం ఇక ముందు మ్యాచుల్లో అభిషేక్‌ను పక్కన పెట్టడమే మంచిదని సలహా ఇస్తున్నారు.

# పాక్ కొంప ముంచిన వర్షం

### న్యూజిలాండ్ మ్యాచ్ రద్దు..

### ఇక ఇదే లాస్ట్ ఛాన్స్!




**కొలంబో:** వర్షం పాకిస్థాన్ కొంప ముంచింది. శనివారం శ్రీలంక రాజధాని కొలంబోలో జరగాల్సిన పాకిస్థాన్ జం న్యూజిలాండ్ టీ20 వరల్డ్ సూపర్ ఎయిట్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. ఈ మ్యాచ్‌కు రిజర్వ్ డే సైతం లేదు. దీంతో చేసేదేమి లేక రెండు జట్లకు ఒక్కో పాయింట్ ఇచ్చారు. వర్షం కారణంగా ఇరు దేశాలకు గడ్డు కాలంగా మారింది. సెమీఫైనల్ అవకాశాలు సన్నగిల్లాయి. పాకిస్థాన్ ఇప్పుడు ఇంకా రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇంగ్లాండ్, శ్రీలంకలతో పాక్ పోటీ పడాల్సి ఉంది. సల్మాన్ అలీ ఆఘా సారథ్యంలోని జట్టు ఈ రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే మొత్తం 5 పాయింట్లతో సెమీఫైనల్‌కు చేరే అవకాశాలు బలంగా ఉంటాయి. ఒకటి గెలిచి, ఒకటి ఓడితే 3 పాయింట్లతో ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. రెండు మ్యాచ్‌లూ ఓడిపోతే పాకిస్థాన్ ఇంటి బాట పట్టాల్సిందే. అయితే.. నేడు స్వల్పంగా వర్షం పడుతుండగా టాస్ ముగిసింది. టాస్ గెలిచిన పాకిస్థాన్ బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే ఆ తేలికపాటి జల్లులు క్రమంగా భారీ వర్షంగా మారడంతో ఒక్క బంతి కూడా వేయకుండానే అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేశారు. ఈ మ్యాచ్ కోసం పాకిస్థాన్ తమ జట్టులో ఒక మార్పు సైతం చేసింది. ఖవాజా నఫాయ్ స్థానంలో ఫఖర్ జమాన్‌ను తుదిజట్టులోకి తీసుకుంది. న్యూజిలాండ్ మాత్రం మూడు మార్పులతో బరిలోకి దిగింది. కెనడాతో జరిగిన మ్యాచ్‌ను అనారోగ్యం కారణంగా మిస్ చేసిన కెప్టెన్ మిచెల్ సాంట్నర్ తిరిగి జట్టులో చేరాడు. అతనితో పాటు లాకీ ఫర్గూసన్, ఇష్ సోధీకి కూడా అవకాశం ఇచ్చారు. ఈ మ్యాచ్ రద్దవ్వడంతో పాకిస్థాన్ డీలా పడింది. ఇక ఫిబ్రవరి 24న ఇదే వేదికలో ఇంగ్లాండ్‌తో, ఫిబ్రవరి 25న న్యూజిలాండ్‌ను దాయాది జట్టు ఎదుర్కోనుంది. దాయాది జట్టు ఇంటికి పయనమవుతుందా? రెండు మ్యాచ్‌లు గెలిచి సెమీస్ ఆడుతుందా? అనే అంశంపై అభిమానులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

# పదేళ్ల తర్వాత హిస్టరీ రిపీట్!

### ఆసీస్ గడ్డపై గర్జించిన భారత మహిళలు




**ఢిల్లీ:** ఆస్ట్రేలియా గడ్డపై భారత లేడీ సింగాలు గర్జించారు. కంగారూ సొంత గడ్డలో ఆ టీమ్‌ను 17 పరుగుల తేడాతో ఓడించారు. ఆస్ట్రేలియా గడ్డపై రెండోసారి టీ20 సిరీస్ గెలిచింది భారత మహిళల జట్టు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకుంది. ఇంతకుముందు 2016లో తొలిసారి ఈ ఘనత సాధించిన ఉమెన్స్ టీమ్, తాజాగా మళ్ళీ చరిత్రను పునరావృతం చేసింది. ముందుగా టాస్ గెలిచిన టీమిండియా బ్యాటింగ్ ఎంచుకుంది. 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 176 పరుగుల చేసింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన కేవలం 55 బంతుల్లోనే 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 82 పరుగులు స్కోర్ చేసి జట్టును నిలబెట్టింది. 149.09 స్ట్రైక్ రేట్‌తో ఆడింది. నెమ్మదిగా ఇన్నింగ్స్ ప్రారంభించి ఆ తర్వాత గేర్ మార్చింది మంధాన.. మెంబర్స్ స్టాండ్‌లోకి కొట్టిన ఓ భారీ సిక్సర్ హైలైట్‌గా నిలిచింది. పేసర్ డార్సీ బ్రౌన్ బౌలింగ్‌లో సిక్సర్ బాది 38 బంతుల్లోనే తన హాఫ్ సెంచరీని పూర్తి చేసుకుంది. తన 160వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్న ఆమెకు ఇది 33వ అర్ధశతకం.

ఓపెనర్ షఫాలీ వర్మ (7) త్వరగానే అవుటైనప్పటికీ, జెమీమా రోడ్రిగ్స్‌తో (46 బంతుల్లో 4 ఫోర్లతో 59 పరుగులు) కలిసి మంధాన ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. ఈ జోడి రెండో వికెట్‌కు ఏకంగా 121 పరుగుల భాగస్వామ్యాన్ని నిర్మించింది. కేవలం 66 బంతుల్లోనే వీరిద్దరూ సెంచరీ భాగస్వామ్యాన్ని సాధించి చివర్లో భారీ స్కోరుకు బాటలు వేశారు. జెమీమా ఎంతో సంయమనంతో ఆడగా, మంధాన తన క్లాస్ షాట్లతో అలరించింది. అయితే చివర్లో ఈ ఇద్దరూ అన్నాబెల్ సదర్లాండ్ (2/34) బౌలింగ్‌లోనే వెనుదిరిగారు. ఆ తర్వాత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ వ్యూహాత్మకంగా రిచా ఘోష్‌ను నాలుగో స్థానంలో పంపగా.. ఆమె ఆ నమ్మకాన్ని నిలబెడుతూ కేవలం 7 బంతుల్లోనే వేగంగా 18 పరుగులు చేసి జట్టు స్కోరును 175 దాటించింది. లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా ఏ దశలోనూ కుదురుకున్నట్లు కనిపించలేదు. ఆష్లీ గార్డనర్ (45 బంతుల్లో 57 పరుగులు) ఒంటరి పోరాటం చేసినప్పటికీ, మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో ఆసీస్ జట్టు 159/9 స్కోరుకే కుప్పకూలింది. భారత బౌలర్ల క్రమశిక్షణతో కూడిన బౌలింగ్ ముందు ఆతిథ్య జట్టు తలవంచింది. లెగ్ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ అద్భుత స్పెల్‌తో 22 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా, అరంగేట్రం చేసిన శ్రీ చరణి 32 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు తీసి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పింది. అరుంధతి రెడ్డి కూడా 35 పరుగులిచ్చి 2 వికెట్లు తీసి ఆసీస్ బ్యాటర్ల మధ్య పెద్ద భాగస్వామ్యాలు నమోదు కాకుండా అడ్డుకుంది. ఎట్టకేలకు పదేళ్ల తర్వాత మహిళల జట్టు రికార్డును పునరావృతం చేసింది.

# రెండో పెళ్లి చేసుకున్న మాజీ ఓపెనర్

**ఢిల్లీ:** భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ రెండో పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్యతో విడాకుల అనంతరం పరిచయమైన సోఫీ షైన్ ని అతడు వివాహమాడాడు. కొన్నాళ్లుగా సోఫీతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్న ధావన్ శనివారం సన్నిహితుల సమక్షంలో ఆమె మెడలో మూడు ముళ్లు వేశాడు. కొత్త జంటకు పలువురు క్రికెటర్లు, సెలబ్రిటీలు శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ కొత్త జీవితం ఆరంభించాడు. రెండోసారి ప్రేమలో పడిన అతడు.. సోఫీ షైన్‌ను పెళ్లి చేసుకున్నాడు. ఫిబ్రవరి 20 మెహందీ, సంగీత్ వేడుకలు ముగియడంతో.. ఫిబ్రవరి 21 శనివారం ఈ జంట వివాహ బంధంలో అడుగుపెట్టింది. సన్నిహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో సందడిగా, సంబురంగా జరిగిన వీరి పెళ్లి ఫొటోలను భారత క్రికెటర్ యజ్వేంద్ర చాహల్ పంచుకున్నాడు. భారతీయ సంప్రదాయ దుస్తుల్లో తళుక్కుమన్న ఈ కొత్త జంటకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.


### ఎవరీ సోఫి

మోడల్‌ను తలపించే అందగత్తె సోఫీ షైన్ సొంత దేశం ఐర్లాండ్. కాస్లేట్రోయ్ కాలేజీలో చదివిన ఈ అందగత్తె ఆ తర్వాత మార్కెటింగ్, మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ పూర్తి చేసింది. ప్రస్తుతం సోఫియా ప్రొడక్ట్ కన్సల్టెంట్‌గా పని చేస్తోంది. అబుదాబీలోని నార్తర్న్ ట్రస్ట్ కో-ఆపరేషన్ సంస్థ-లో ఉపాధ్యక్షురాలిగా సేవలందిస్తోందీ ముద్దుగుమ్మ. ఈ బ్యూటీకి సోషల్ మీడియాలో లక్ష 34 వేలమంది ఫాలోవర్లు ఉన్నారు. దుబాయ్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ జరిగినప్పటి నుంచి జంటగా కనిపించిన ధావన్, సోఫీయాలు ఎట్టకేలకు పెళ్లితో తమ అనుబంధాన్ని శాశ్వతం చేసుకున్నారు.



# అంధుల క్రికెట్‌కు అండగా..

### బీసీసీఐ కీలక నిర్ణయం




**ముంబయి:** ఇటీవలి కాలంలో అంధుల క్రికెట్‌లోనూ టీమ్ఇండియా ప్లేయర్లు అద్భుతాలు సృష్టిస్తున్నారు. ఇటు పురుషుల జట్టుతోపాటు మహిళా జట్టు వరల్డ్ కప్‌లను గెలిచి సత్తా చాటారు. అయితే, వారికి అందే అరకొర సాయంతోనే ఇన్నాళ్లూ నెట్టుకొచ్చారు. ఏదైనా టోర్నీలో విజేతగా నిలిస్తేనే ఆ ప్లేయర్లకు నగదు అందుతోంది. దీంతో కొందరు ఉద్యోగాలు చేసుకుంటూనే మ్యాచులకు సిద్ధం కావాల్సిన పరిస్థితి ఉంది. ఇక నుంచి ఆ కష్టాల నుంచి భారత అంధుల క్రికెట్ బయటపడబోతోంది. దానికి కారణం ప్రపంచంలోనే అత్యంత ధనిక బోర్డు బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. మెరుగైన అవకాశాలు కల్పించడం, క్రికెట్ వృద్ధి కోసం సాయం చేసేందుకు ముందుకొచ్చింది. ప్రస్తుత ఐసీసీ ఛైర్మన్ జైషా బీసీసీఐ సెక్రటరీగా ఉన్నప్పుడే ఈ విధానానికి శ్రీకారం చుట్టారు.

### బీసీసీఐ సాయం ఇలా..

విదేశాల్లో రెండు అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనేందుకు అవసరమైన ప్రయాణ సదుపాయాలను కల్పించడం. స్వదేశం వేదికగా జరిగే ద్వైపాక్షిక సిరీసుల్లో పాల్గొనే భారత్, పర్యాటక ప్లేయర్లకు వసతి సదుపాయం. బీసీసీఐకి సంబంధించిన వేదికలను వాడుకొనేందుకు అవకాశం. దేశవాళీ, అంతర్జాతీయ మ్యాచులు ఆడే సదుపాయం. ఆటకు సంబంధించి అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన పరిస్థితులను కల్పించడం.

# 'నా వాడు.. లక్కీ గర్ల్ నేనే'

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ప్రేమలో మునిగితేలుతున్నాడు. భార్య నటాషా స్టాంకోవిక్‌తో విడిపోయిన ఈ బరోడా క్రికెటర్‌కు మహీక శర్మ రూపంలో కొత్త ప్రేమ దొరికింది. గతేడాది తమ బంధాన్ని బహిర్గతం చేసిన హార్దిక్- మహీక అప్పటి నుంచి రొమాంటిక్ పోస్టులతో సోషల్ మీడియాను నింపేస్తున్నారు. ప్రస్తుతం హార్దిక్ పాండ్యా టీ20 ప్రపంచకప్-2026 టోర్నమెంట్‌తో బిజీగా ఉన్నాడు. ఆల్‌రౌండ్ ప్రతిభతో రాణిస్తూ టీమిండియా విజయాల్లో తన వంతు పాత్ర పోషిస్తున్న హార్దిక్.. ప్రియురాలు మహీక పుట్టినరోజును ఇటీవల ఘనంగా సెలబ్రేట్ చేశాడు. హార్దిక్‌తో కలిసి దిగిన ఫొటోలు పంచుకుంటూ.. "ఐ లవ్ మై మ్యాన్. నా జీవితంలో ఇప్పటి వరకు ఇదే అత్యుత్తమైన పుట్టినరోజు. థాంక్యూ బేబీ. ఈ ప్రపంచంలో అందరికంటే అదృష్టవంతురాలైన అమ్మాయిని నేనే" అంటూ హార్దిక్‌తో దిగిన ఫొటోలను షేర్ చేసింది.





# అల్లు అర్జున్ ప్రైవేట్ పార్టీలో రామ్ చరణ్-ఉపాసన



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ - మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ చాలా నెలల తర్వాత ఒకే ఫ్రేమ్‌లో మెరిశారు. అల్లు శిరీష్ ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ లో భాగంగా బన్నీ ఏర్పాటు చేసిన ప్రైవేట్ పార్టీలో రామ్ చరణ్ ఉపాసన దంపతులు సందడి చేశారు. కాబోయే వధూవరులు అల్లు శిరీష్ - నయనికలతో బన్నీ - చెర్రీ కలిసి దిగిన ఓ పిక్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ 'మెగా - అల్లు' కలయిక అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.అల్లువారబ్బాయి శిరీష్ మరికొన్ని రోజుల్లో ఓ ఇంటివాడు కాబోతున్న సంగతి తెలిసిందే. ప్రేయసి నయనికతో ఏడడుగులు వేయబోతున్నాడు. ఇప్పటికే అల్లు ఫ్యామిలీలో పెళ్లి సందడి మొదలైపోయింది. ఇటీవల అల్లు సోదరులు దుబాయ్ లో గ్రాండ్ గా పార్టీ నిర్వహించారు. హైదరాబాద్ లోని అల్లు వారి నివాసంలో పసుపు దంచే కార్యక్రమంతో పెళ్లి పనులు మొదలుపెట్టారు. తమ్ముడు వివాహం సందర్భంగా అల్లు అర్జున్ తాజాగా ఓ ప్రైవేట్ పార్టీ ఏర్పాటు చేయగా.. దానికి రామ్ చరణ్ హాజరవ్వడం అందరి దృష్టిని ఆకర్షించింది. మరికొన్ని రోజుల్లో అల్లు శిరీష్ పెళ్లి పీటలు ఎక్కబోతున్న నేపథ్యంలో, అల్లు అర్జున్ తన ఫామ్ హౌస్ లో శుక్రవారం రాత్రి గ్రాండ్ ప్రీవెడ్డింగ్ పార్టీ నిర్వహించారు. కుటుంబ సభ్యులు, ఇండస్ట్రీలోని అత్యంత సన్నిహితులు ఈ పార్టీకి అటెండ్ అయ్యారని తెలుస్తోంది. ఈ వేడుకకు రామ్ చరణ్ తన భార్య ఉపాసనతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్, రామ్ చరణ్ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకోవడమే కాకుండా, కలిసి ఫోటోలకు పోజులిచ్చారు. కాబోయే వధూవరులు అల్లు శిరీష్ - నయనికలతో అల్లు అర్జున్ - స్నేహా రెడ్డి, రామ్ చరణ్ - ఉపాసన దంపతులు కలిసి ఫోటో దిగారు. ఈ పిక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో అల్లు - మెగా ఫ్యామిలీ మెంబెర్స్ బ్లాక్ డ్రెస్సుల్లో మెరిశారు. దీక్షలో ఉన్న చరణ్.. చెప్పులు లేకుండా సింపుల్ గా నిలబడి ఉన్నారు. మిగతా వారు మాత్రం మోడరన్ డ్రెస్సుల్లో కనిపిస్తున్నారు. ఈ ఫోటో నెట్టింట సందడి చేస్తోంది. చాలా కాలం తర్వాత బన్నీ - చెర్రీ ఒకే ఫ్రేమ్‌లో కనిపించడంతో అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. తెలుగు చిత్ర పరిశ్రమలో 'మెగా' & 'అల్లు' కుటుంబాలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. గత కొంతకాలంగా ఈ రెండు కుటుంబాల మధ్య దూరం పెరిగిందని, ముఖ్యంగా రామ్ చరణ్ - అల్లు అర్జున్ మధ్య కోల్డ్ వార్ నడుస్తోందని సోషల్ మీడియాలో రకరకాల ప్రచారాలు సాగుతున్నాయి. అయితే సందర్భం వచ్చినప్పుడల్లా ఇరు వర్గాలు ఆ పుకార్లకు ఫుల్ స్టాప్ పెడుతూ వస్తున్నారు. అల్లు శిరీష్ ఎంగేజ్మెంట్ కి మెగా ఫ్యామిలీ మొత్తం హాజరైంది. ఇటీవల చరణ్ - ఉపాసన దంపతులకు కవలలు పుడితే, వారికి బన్నీ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఇప్పుడు బన్నీ ఏర్పాటు చేసిన పార్టీలో చెర్రీ - ఉపాసనలు సందడి చేశారు.


# పవర్‌ఫుల్ లాయర్‌గా తాప్సీ

ఒకప్పుడు తన అందాలతో తెలుగు ప్రేక్షకులను అలరించారు ఉత్తరాది భామ తాప్సీ పన్ను. కానీ అందరు హీరోయిన్ల మాదిరిగానే ఆమెకు బాలీవుడ్‌పై మోజు పుట్టి అక్కడే సెటిలైపోయింది. ఒకటి రెండు హిట్లు తప్పించి హిందీ చిత్ర పరిశ్రమలో తాప్సీ కెరీర్‌లో పెద్దగా మెరుపులు లేవు. కానీ ఏదో కిందా మీదా పడుతూ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు తాప్సీ. దోబారా, తడ్కా, బ్లర్, ధక్ ధక్, డూంకీ, ఖేల్ ఖేల్ మై తదితర సినిమాలలో ఆమె నటించారు. తాజాగా తాప్సీ పన్ను లీడ్ రోల్‌లో నటించిన చిత్రం అస్సీ. మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాల బ్యాక్‌డ్రాప్‌లో యదార్థ ఘటనల తెరకెక్కిన లేడీ ఓరియెంటెడ్ మూవీ అస్సీ. కోర్ట్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రంలో తాప్సీ పన్ను పవర్‌ఫుల్ లాయర్‌గా నటించారు. ఫిబ్రవరి 20వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చింది. టీ సిరీస్ ఫిల్మ్స్, బెనారస్ మీడియా వర్క్స్ బ్యానర్‌పై భూషణ్ కుమార్, కృషన్ కుమార్, అనుభవ్ సిన్హాలు సంయుక్తంగా అస్సీ మూవీని నిర్మించగా.. అనుభవ్ సిన్హా దర్శకత్వం వహించారు. తాప్సీతో పాటు కని కుస్రుతి, రేవతి, మనోజ్ పహ్వా, కుముద్ మిశ్రా, మహమ్మద్ జీషన్ ఆయూబ్, సత్యజిత్ శర్మ, విపుల్ గుప్తా తదితరులు కీలకపాత్రలు పోషించారు. సీతా పహ్వా, సుప్రీయ పాఠక్, నసీరుద్దీన్ షాలు గెస్ట్ రోల్‌లో అలరించారు. ఈవారం ముల్లిగన్ ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించగా.. అమర్జిత్ సింగ్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. రంజిత్ బరత్ సంగీత దర్శకత్వం వహించారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల పారితోషం, ప్రొడక్షన్ కాస్ట్, ప్రమోషనల్ కార్యక్రమాలతో కలిపి అస్సీ మూవీకి 40 కోట్ల రూపాయల బడ్జెట్ అయ్యింది. టీజర్, ట్రైలర్ తదితర ప్రమోషనల్ కార్యక్రమాలతో అస్సీ మూవీకి ఓ మాదిరిగా థియేట్రికల్, నాన్ థియేట్రికల్ బిజినెస్ జరిగినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా లాభాల్లోకి రావాలంటే బాక్సాఫీస్ వద్ద 80 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్ రాబట్టాల్సి ఉందని ట్రేడ్ పండితులు వాల్యూ నిర్దేశించారు.




# స్టార్ హీరోయిన్లకు మించిన క్రేజ్

ప్రస్తుతం తెలుగు బుల్లితెరపై దూసుకుపోతున్న సీరియల్ గుండె నిండా గుడిగంటలు. అత్యధిక టీఆర్పీ రేటింగ్‌తో ఈ సీరియల్ రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఫ్యామిలీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సాధారణ మధ్య తరగతి కుటుంబ కథతో సాగుతున్న ఈ సీరియల్ ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతుంది. అందుకే ఈ సీరియల్ కు రోజు రోజుకీ విపరీతమైన రెస్పాన్స్ వస్తుంది. ఇక ఇందులో ప్రధాన పాత్రలు బాలు, మీనా జోడికి సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉందంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా మీనా గురించి చెప్పుకుంటే.. అందంతోపాటు పద్దతిగా చీరకట్టులో కనిపిస్తూ అద్భుతమైన నటనతో కట్టిపడేస్తుంది. మీనా అసలు పేరు అమూల్య గౌడ. కన్నడ సినీరంగానికి చెందిన ఈ ముద్దుగుమ్మకు తెలుగులో ఫాలోయింగ్ ఎక్కువే. సీరియల్లో పద్దతిగా కనిపించే అమూల్య.. సోషల్ మీడియాలో మాత్రం గ్లామరస్ ఫోటోలతో రచ్చ చేస్తుంది. నెట్టింట ఈ అమ్మడు చేసే అరాచకం గురించి చెప్పక్కర్లేదు. మైసూర్ కు చెందిన అమూల్య గౌడ.. దాదాపు పదేళ్ల క్రితం సినీప్రయాణం స్టార్ట్ చేసింది. కన్నడ సీరియల్ స్వాతి ముత్తుతో నటిగా తెరంగేట్రం చేసింది. ఆ తర్వాత కోమలి సీరియల్ ద్వారా ఫేమ్ సంపాదించుకుంది. కన్నడలో పలు సీరియల్స్ చేసిన ఈ అమ్మడు.. కార్తీక దీపం సీరియల్లో శౌర్య పాత్రతో తెలుగు అడియన్స్ ముందుకు వచ్చింది. ఇందులో రౌడీ బేబీగా మరింత పాపులర్ అయ్యింది.ఆ తర్వాత గుండె నిండా గుడిగంటలు సీరియల్లో మీనా పాత్రతో మరింత పాపులర్ అయ్యింది. ఈ సీరియల్ ఆమె కెరీర్ టర్నింగ్ పాయింట్ అయ్యింది. ప్రస్తుతం ఈ సీరియల్ విజయవంతంగా దూసుకుపోతుంది. ఇక ఇప్పుడు ఆమె సోషల్ మీడియాలో గ్లామర్ లుక్స్ తో హీటెక్కిస్తుంది. ఇదిలా ఉంటే.. అమూల్య గౌడ ఒక్క ఎపిసోడ్ కోసం రూ.30 నుంచి రూ.35 వేలు తీసుకుంటుందట. ఇప్పుడు ఈ విషయం తెలిసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు.



# కోటి పారితోషికం





'ధమాకా' తర్వాత హీరోయిన్ గా శ్రీలీల ఖాతాలో ఒక్క హిట్టు కూడా పడలేదు. బాలకృష్ణ- అనిల్ రావిపూడి కాంబినేషన్లో వచ్చిన 'భగవంత్ కేసరి' హిట్ అయినా.. అందులో శ్రీలీల హీరోయిన్ కాదు. అయినప్పటికీ దాని సక్సెస్ క్రెడిట్ శ్రీలీల ఖాతాలో పడలేదు. 'స్కంద' 'ఆదికేశవ' 'ఎక్స్ట్రా ఆర్డియనరీ మెన్' 'గుంటూరు కారం' 'రాబిన్ హుడ్' 'జూనియర్' 'మాస్ జాతర' 'పరాశక్తి' ఇలా అన్నీ డిజాస్టర్లే. వేరే హీరోయిన్ ట్రాక్ రికార్డు ఇలా ఉంటే.. ఈపాటికి దుకాణం సర్దేసేది. కానీ శ్రీలీల ఆ విషయంలో లక్కీ అనే చెప్పాలి. ఇన్ని డిజాస్టర్లు పడినప్పటికీ.. ఆమె డిమాండ్ ఏమీ తగ్గలేదు. ఇప్పటికీ ఆమె కోటి రూపాయలు పారితోషికం అందుకుంటుంది. ప్రస్తుతం ఆమె హిందీలో 2 సినిమాల్లో నటిస్తుంది.అవి రెండూ క్రేజీ ప్రాజెక్టులే. మరోవైపు తమిళంలో క్రేజీ ఆఫర్లు అందుకుంటుంది. ధనుష్ 50వ సినిమాలో సాయి పల్లవితో పాటు మరో హీరోయిన్ గా నటిస్తుంది. అలాగే అజిత్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో కూడా హీరోయిన్ గా నటిస్తుంది.మరోవైపు పవన్ కళ్యాణ్ కి జోడీగా 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాలో నటించింది. హరీష్ శంకర్ దర్శకత్వం వహించిన సినిమా అది. మార్చి 26న రిలీజ్ అవుతుంది. ఈ సినిమాకి సంబంధించి శ్రీలీల తన పాత్రకి డబ్బింగ్ చెప్పడం కూడా పూర్తయ్యింది. ఈ ఒక్క సినిమా హిట్ అయితే.. శ్రీలీల ఫ్లాప్స్ నుండి బయటపడినట్టే. దర్శకుడు హరీష్ శంకర్ కి కూడా ఫ్లాప్స్ లో ఉన్న హీరోయిన్స్ ని బయటపడేసిన ట్రాక్ రికార్డ్ ఉంది. సో శ్రీలీలకి గుడ్ టైమ్ స్టార్ట్ అయినట్టే...!

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNIVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131